





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

అవినీతి అధికారులపై విచారణ : గోరంట్ల

రాజమహేంద్రవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వీఆర్‌వోల నుంచి తహశీల్దార్..కలెక్టరేట్ వరకూ రెవెన్యూ అధికారులు చేసిన అవినీతి, అన్యాయాలపై విచారణ జరిపిస్తామని.. వైసీపీ నేతలతో కుమ్మక్కయి తప్పులు చేసిన అధికారుల భరతం పడతామని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి స్పష్టం చేశారు. తన స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ మొదలు అవినీతికి పాల్పడిన వారందరినీ చట్టప్రకారం శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో రెవెన్యూ అధికారులు అనేక మంది ఎకరాల కొలదీ భూములను అన్యాక్రాంతం చేశారన్నారు. అవన్నీ బయటకు రప్పించి చట్టప్రకారం దోషులపై చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్ ఎమ్మెల్యేనైన నాకు కూడా ప్రొటోకాల్ పాటించకుండా ఇబ్బందులు పెట్టారని వాపోయారు. రాజమహేంద్రవరం రూరల్ పరిసర గ్రామాల విలీన ప్రక్రియను పూర్తి చేసి మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిపిస్తామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఐదు హామీల అమలు ఫైళ్లపై సంతకం చేశారన్నారు. డిసెంబర్ లోపు మెగా డీఎస్సీ పూర్తి చేయడానికి ఆదేశాలిచ్చారన్నారు. మంచి సేవల ద్వారా ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. బాధితులకు అండగా నిలబడతానన్నారు.

గోదావరి ప్రక్షాళనకు ప్రాజెక్టు..

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూన్ 14 : రాజమహేంద్రవరంలో రామకృష్ణనగర్, నేతాజీ నగర్, రైల్వేస్టేషన్,ఆవ చానల్‌లు కొత్త ముంపు ప్రాంతాలుగా మారాయని వాటికి ప్రత్యామ్నాయంగా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సూచించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు , ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఆయన శుక్రవారం ఆవచానల్, ధవళేశ్వరం సాయిబాబా ఆలయం వద్ద గల మురుగుకాలువను పరిశీలించారు. గత రెండేళ్లుగా ఎత్తిపోతల పథకాన్ని అధికారులు పెండింగ్‌లో పెట్టారని దీంతో వర్షం పడినప్పుడల్లా కొత్త ముంపు ప్రాంతాలు తయారవుతున్నాయన్నారు.ఈ ప్రాజెక్ట్ త్వరితగిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.గతంలో గంగా కాలుష్య నివారణ పథకంలో గోదావరి ప్రక్షాళన కార్యక్రమానికి నాంది పలకడం జరిగిందని.. అది సుమారు వెయ్యి నుంచి రూ.1200 కోట్లు ప్రాజెక్ట్ అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రాజెక్ట్ పూర్తి చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. అది పెండింగ్‌లో ఉందని ఈ సారి దానిని పూర్తి చేసే ఆలోచనలో ఉన్నామన్నారు.ఆయన వెంట గోరంట్ల కుమార్తె కంఠమనేని శిరీష, రూరల్ టీడీపీ అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, టీడీపీ నాయకులు, అధికారులు ఉన్నారు.

వరిలో విత్తన శుద్ధి తప్పనిసరి : జేడీఏ

రాజానగరం, జూన్ 14 : వరి నారుమడుల తయారీలో రైతులు విధిగా విత్తన శుద్ధి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులకు సూచించారు. కలవచర్లలోని వరి నారుమడులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. వరి నారుమడిలో యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తన శుద్ధి గురించి రైతులకు వివరించారు. కిలో విత్తనానికి కార్బండిజమ్ లేదా మాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి వాడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీఏ ఏడీ జయ లక్ష్మి,ఆత్మ పీడీ జ్యోతిర్మయి, డీఆర్‌ఆర్సీ ఏడీఎం జయలక్ష్మి,ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డి, ఏవో షేక్ ఖాసిం పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట : ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిడదవోలు పోలీస్ స్టేషన్‌ని ఎస్పీ జగదీశ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తులో పురోగతి, నేర నియంత్రణపై ఆరా తీశారు.

పొట్టకూటికి వెళ్లి.. పరలోకానికి..

రోడ్డు ప్రమాదంలో కాకినాడ, కోనసీమ జిల్లావాసులు ఐదుగురు మృతి - 7లో..



తూర్పున.. త్రి..నేత్రం!

ముగ్గురికి చంద్రబాబు మార్క్ మంత్రి పదవులు

చంద్రబాబా... మజాకానా.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ముగ్గురు మంత్రులకు శాఖలు కేటాయించారు.. శెహబాస్ అనిపించుకున్నారు.. జిల్లాను దృష్టిలో పెట్టుకుని అత్యంత కీలక శాఖలు కట్టబెట్టారు... జిల్లాలో గ్రామీణ ప్రాంతం చాలా ఎక్కువ... ఈ నేపథ్యంలో పల్లెల దశ..దిశ మారుస్తానంటూ రాజకీయాల్లోకి వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖలను కేటాయించారు. మరో మంత్రి కందుల దుర్గేష్‌కు పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలను కేటాయించారు.. ఇటు గోదావరి నుంచి అటు ఏజెన్సీ వరకు... మరో పక్కఎంతో అందమైన కడియపులంకను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి జిల్లాలో ఎంతో అవకాశం ఉంది. ఇక మూడో మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కార్మిక శాఖ కేటాయించారు. మన జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు.. పరిశ్రమల కార్మికులు ఎక్కువే.. ఇలా మూడు శాఖలు 'తూర్పు'నకు త్రినేత్రమే....

- కీలక శాఖలు అప్పగింత
- పల్లెల బాధ్యత పవన్‌కు..
- జిల్లాలో గ్రామాల విస్తీర్ణమే ఎక్కువ
- సురక్షిత తాగునీటికి ఆయనే దిక్కు
- పర్యాటకానికి కేరాఫ్‌గా దుర్గేష్
- జిల్లాలో గోదావరి.. సముద్రం
- కార్మిక సమస్యలు తీర్చేలా సుభాష్
- జిల్లావ్యాప్తంగా బోలెడు పరిశ్రమలు
- లక్షలాదిగా భవన నిర్మాణ కార్మికులు
- 'తూర్పు' దశ మారేలా కేటాయింపులు

పవన్.. పంచాయతీరాజ్

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు అత్యంత కీలక శాఖలు లభించాయి. మంత్రులకు శుక్రవారం శాఖల కేటాయింపు జరగ్గా అందులో భాగంగా సీఎం చంద్రబాబు పవన్‌కు అత్యంత ముఖ్యమైన బాధ్యతలు కట్టబెట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్), అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను కేటాయించారు. అటు డిప్యూటీ సీఎం పదవి కూడా కేటాయిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకరకంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సురక్షిత తాగునీరు, ఇంటింటికీ కుళాయి తదితర పనులన్నీ ఈ శాఖల ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి. దీంతో జిల్లాలో అత్యధికంగా ఉన్న గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక మంది మంత్రులుగా పనిచేశారు. అయితే పీఆర్, రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యుఎస్, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు ఇంతకు ముందు ఎవరికీ దక్కలేదు. ఏ ప్రభుత్వంలో అయినా ఈ కీలక శాఖలను అత్యంత సీనియర్ మంత్రులకే కేటాయించేవారు. కానీ ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం హోదాలో ఈ ముఖ్యమైన శాఖలను కట్టబెట్టడం విశేషం. వాస్తవానికి ఈ శాఖలు పూర్తిగా గ్రామీణ మండలాలకు సంబంధించినవి. అటు పవన్‌కు కూడా ఈ శాఖల ద్వారా గ్రామాల రూపురేఖలను మార్చాలనే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో అవే దక్కడం విశేషం. పవన్ కల్యాణ్ ఒకట్రెండు రోజుల్లో తనకు కేటాయించిన శాఖల బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రధానంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి జిల్లాలో అనేక పనులు చేపట్టడానికి వీలుంది. ఈ శాఖ పరిధిలోకి పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు రానున్నాయి. గ్రామాల్లో అభివృద్ధి, వాటి రూపురేఖలను మార్చడం ఈ శాఖ ద్వారానే సాధ్యం. ఈ శాఖకు అటు రాష్ట్రం, ఇటు కేంద్రం నుంచి సైతం నిధులు భారీగా వస్తాయి. తద్వారా జిల్లాలో పంచాయతీలపై దృష్టిపెట్టి వాటిని పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడానికి పవన్‌కు అవకాశం కలిగిందనే చెప్పాలి. ప్రధానంగా పిఠాపురం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతం ఎక్కువ. తనకు దక్కిన శాఖల ద్వారా నియోజకవర్గంలో పంచాయతీలను ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు అభివృద్ధి బాట పట్టించడానికి పవన్‌కు మార్గం సుగమమైందనే చెప్పాలి. గ్రామీణ నీటిసరఫరా శాఖ(ఆర్‌డబ్ల్యుఎస్) శాఖ మంత్రిగా పవన్‌కు గ్రామాల్లో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడానికి గట్టిగా పనిచేసే అవకాశం లభించిందనే చెప్పాలి. ఇంటింటికీ తాగునీటి కుళాయి పథకం ఈశాఖ పరిధిలోకే వస్తుంది. ఇప్పటికే కేంద్రం జాతీయ జలమిషన్ కింద జిల్లాకు రూ.500కోట్లకుపైగానే కేటాయించింది. కానీ గత వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వలేదు సరికదా, ఇంటింటికీ కుళాయి పనులను గాలికొదిలేసింది. ఇంటింటికీ సురక్షిత తాగునీరు పథకాన్ని ఎన్నికలకు ముందు టీడీపీ తన సూపర్ సిక్స్‌లో ప్రకటించింది. జిల్లాకు ఈ శాఖ ద్వారా భారీగా నిధులు పవన్ కేటాయించి పనులు చేయించే అవకాశం ఏర్పడింది. వాస్తవానికి కలుషిత నీరు తాగి తొండంగి మండలంలో రెండు రోజులుగా 300 మంది వరకు డయేరియా బారిన పడ్డారు. ఇందులో ఒకరు శుక్రవారం మృతి చెందారు. కలుషిత నీటి మరణాలు లేకుండా గ్రామీణనీటి సరఫరాశాఖ ద్వారా జిల్లాతో పాటు పిఠాపురం నియోజకవర్గానికి సైతం భారీగా నిధులు కేటాయించవచ్చు. అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు పవన్‌కే దక్కాయి. ఆయా శాఖల్లో గత ప్రభుత్వ అరాచకాలపై విచారణ చేయడంతో పాటు ఇకపై వీటి ఉల్లంఘనలు జరగకుండా పవన్ దృష్టిసారించాల్సి ఉంది.

దుర్గేష్‌కు.. పర్యాటకం

రాజమహేంద్రవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.. ఇది జిల్లా వాసులు పదేపదే వినేమాట.. ఆ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకున్నారో ఏమో కానీ జిల్లా నుంచి నిడదవోలు ఎమ్మెల్యేగా ఎన్నికైన కందుల దుర్గేష్‌కు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖలను కేటాయిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిడదవోలు నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారిగా కందుల దుర్గేష్‌కు మంత్రి పదవి దక్కింది. ఇప్పటివరకూ జిల్లాకు పర్యాటక శాఖ కేటాయించిన దాఖలాలు లేవు. తొలిసారి ఆ పర్యాటక శాఖ దక్కడంపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యాటకానికి ఎంతో అవకాశం ఉంది. ఒకపక్క ఉభయగోదావరి జిల్లాల్లో ఎంతో అందమైన గోదావరి.. మరోపక్క చూసే కొద్దీ చూడాలనిపించే సముద్రం.. ఇంకోపక్క మడ అడవులు.. ఏజెన్సీ.. అక్కడ జాలువారే జలపాతాలు.. ఇక షూటింగ్‌లు చేసుకోవడానికి ఎంతో అందమైన ప్రకృతి.. సాంస్కృతికపరంగా రాజమహేంద్రవరానికి పెద్ద పేరు.. ఇవన్నీ ఆలోచించే దుర్గేష్‌కు ఆ శాఖలు కేటాయించి ఉంటారని జనం భావిస్తున్నారు.. గత పుష్కరాల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అఖండ గోదావరిలో బోటు మీద స్వయంగా పర్యటించి అఖండ గోదావరి టూరిజం ప్రాజెక్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పట్లో రూ.100 కోట్లు కేటాయించారు. రాజమహేంద్రవరం కేంద్రంలో ఈ ప్రాజెక్టు కార్యాలయం ఏర్పాటు చేశారు. పిచ్చుకలంకను అభివృద్ధి చేయాలని, హేవలాక్ బ్రిడ్జిని తీర్చిదిద్దాలని, రాజమండ్రిలోని చారిత్రక కట్టడాలను, ప్రాంతాలను పర్యాటక హబ్‌గా మార్చాలని ప్రయత్నం చేశారు. పాపికొండలును అభివృద్ధి చేయాలనుకున్నారు. కాకినాడ హోప్ ఐలాండ్, కోరంగి మడ అడవులు, కోనసీమ ప్రాంతాలను అభివృద్ధి చేసి టూరిజానికి తగినట్లు హోటళ్లు, రిసార్ట్ అభివృద్ధి చేసే ప్రయత్నం చేశారు. కానీ జగన్ నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అఖండ గోదావరి ప్రాజెక్టు మూతపడింది. అసలు పర్యాటక రంగాన్ని పట్టించుకోలేదు. గోదావరి జిల్లాలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధి ఆగిపోయింది. టూరిజం పట్ల అభి రుచి ఉన్న చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడం, ఈ ప్రాంత అభివృద్ధిని కోరుకునే కందుల దుర్గేష్‌కి పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల దక్కడంతో ఈ ప్రాంతం టూరిజం హబ్‌గా అభివృద్ధి చెందనుంది. మంత్రి పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా రాజమహేంద్రవరం వచ్చిన మంత్రి కందుల దుర్గేష్‌కు సిటీ జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. సుమారు 4 గంటలకు ధవళేశ్వరం వచ్చిన మంత్రి దుర్గేష్ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరడానికి మూడున్నర గంటలు సమయం పట్టింది. అదే సమయంలో వర్షం రావడంతో తడుస్తూనే ర్యాలీ కొనసాగించారు.

కార్మిక శాఖకు..సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 14: కార్మికుల కష్టాలు తీరనున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎటు చూసినా పరిశ్రమలు అధికం.. మరో వైపు భవన నిర్మాణ కార్మికులు ఎక్కువే. ఈ నేపథ్యంలో రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వాసంశెట్టి సుభాష్‌కు కార్మిక శాఖ కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో గతం నుంచీ ఎంతో మంది మంత్రులుగా పనిచేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా ఏర్పడిన తరువాత సుభాష్ తొలిసారి మంత్రి పదవి చేపట్టారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎంతో మంది మంత్రులుగా పనిచేశారు. ఇప్పటివరకు ఎవరూ కార్మిక శాఖను చేపట్టిన దాఖలాలు లేవు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులతో పాటు అనేక ఇతర రంగాలకు చెందిన కార్మికులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలు జరిగే అనేక సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయాయి. కార్మిక సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించారని విమర్శలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ బోర్డు ద్వారా అమలు జరిగే అన్ని పథకాలు నిలిచిపోయాయి. దీంతో కార్మికులు తీవ్ర ఆవేదన చెందారు. ప్రస్తుత ప్రభుత్వంలో జిల్లాకు కార్మికశాఖ దక్కడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్మిక శాఖ కేటాయించిన వెంటనే మంత్రి సుభాష్ విజయవాడలో కార్మిక శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. కార్మికులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పథకాలపై చర్చించారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన అన్ని సంక్షేమ పథకాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని మంత్రి సుభాష్ ప్రకటించడంతో కార్మికులు, కార్మిక సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొవ్వూరులో.. గలీజు!

మునిసిపల్ షాపుల అద్దె వ్యవహారంలో కక్కుర్తి

- మునిసిపల్ ఆదాయానికి భారీగా గండి
- రూ.775 నుంచి షాపు అద్దె ఆరంభం
- బహిరంగ మార్కెట్‌లో రూ.10 వేలపైనే
- వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు
- 20 ఏళ్లుగా షాపుల్లో దళారీల తిష్ఠ
- అయినా పట్టని ఉన్నతాధికారులు
- మళ్లీ టెండర్లు పిలవాలని డిమాండ్

కొవ్వూరు, జూన్ 14: అధికారుల చేతివాటంతో మునిసిపల్ ఆదాయానికి గండి పడుతుంది. పట్టణంలో కమర్షియల్ షాపుల లీజులు రూ.10 వేల నుంచి రూ.22 వేలు నడుస్తుండగా మునిసిపల్ కమర్షియల్ షాపులు మాత్రం ఎక్కడా లేని విధం గా రూ.3500లకే అతి తక్కువ లీజుకు మునిసిపల్ రెవిన్యూ సిబ్బంది ప్రతిపాదనలు చేసి పాలకవర్గాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. కొవ్వూరు మునిసి పాలిటీకి మెయిన్ రోడ్‌లో బాపూజీ కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్, మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద, సత్యవతినగర్, అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద 110 కమర్షియల్ షాపులు ఉన్నాయి. ఆ షాపుల అద్దెలు చూస్తే అందరూ అవాక్కవుతారు. ఎందుకంటే ఒక్కో షాపు అద్దె అతి తక్కువ రూ.775.. ఎక్కువ రూ.5333ల లీజు. దీంతో 110 షాపుల నుంచి మునిసిపాలిటీకి సుమారు రూ.కోటి ఆదాయం రావాల్సి ఉండగా కేవలం రూ.29.44 లక్షల ఆదాయం మాత్రమే వస్తుంది. అంటే ఒక్కో షాపు లెక్కించినా కేవలం రూ.2900 అద్దె మాత్రమే వస్తుందన్నమాట..

ఒక్కోషాపు అద్దె రూ.775

కొవ్వూరు మెయిన్‌రోడ్‌లో మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో కమర్షియల్ షాపులను లీజుకివ్వడానికి సుమారు 20 ఏళ్ల కిందట అధికారులు టెం డర్లు పిలిచారు. నిబంధనల ప్రకారం టెండర్లు దక్కించుకున్న వ్యక్తులే షాపులు నడిపించుకోవాలి ఇతరులకు ఇవ్వరాదు. కాని చాలా మంది టెండర్లు తర్వాత మూడు రెట్లు పెంచి మరలా వేరేవారికి అద్దెకిచ్చారు. ఇదంతా మునిసిపల్ అధికారులకు తెలిసే జరుగుతున్నాకిమ్మనరు. కొవ్వూరు మునిసిపాలిటీలో చిన్న జాగా ఉంటే రూ.5 వేలకు అద్దెకు ఇస్తున్నారు. మెయిన్‌రోడ్‌లో షాపు అద్దెలు రూ.10 వేల నుంచి రూ.22 వేల వరకు ఉన్నాయి. అటువంటిది కొవ్వూరులోని ప్రధాన మార్కెట్ సెంటర్ బాపూజీ కూరగాయల మార్కెట్‌లో మునిసిపల్ షాపులను అధికారులు కేవలం రూ.775ల నుంచి రూ.2350లకు లీజుకు అందజేశారు. బాపూజీ కూరగాయల మార్కెట్‌లో 18 షాపులు ఉండగా 1వ నెంబరు షాపు రూ.11485, 2,3,4,5,6,7,8 షాపులు లీజు ఒక్కో షాపునకు రూ.5333, 9 నుంచి 15 షాపులు ఒక్కో షాపు రూ.2890 లీజుకు అందజేశారు. ఒకే ప్రాంగణంలో ఉన్న 15 షాపుల్లో అద్దెలను చూస్తే మునిసిపల్ అధికారుల కక్కుర్తి బయటపడుతుంది. జూనియర్ కాలేజ్ సెంటర్‌లో ఉన్న పంచాయితీరాజ్ షాపుల అద్దె కంటే తక్కువ అద్దెకు లీజుకు ప్రతిపాదించడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. కొవ్వూరులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఆర్అండ్ బీ కార్యాలయం ముందు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రేకులషెడ్డులో ఉన్న షాపులు నెలకు లీజు రూ.1197లు, వాటర్‌ట్యాంకు జీఎన్‌టీ రోడ్‌లో ఉన్న షాపులు రూ.775ల నుంచి 2350 వసూలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో అద్దెలు భారీగా పెరుగుతున్నా మునిసిపల్ అధికారులు అక్రమార్కులకు మద్దతిస్తూ మునిసిపల్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

నిబంధనలు హుష్‌కాకి

షాపుల లీజు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్ఆర్‌వో రేట్లు, ప్రస్తుత అద్దెపై 33 శాతం పెంపు, బహిరంగ మార్కెట్‌లో అద్దెలను పరిశీలించి, వాటిలో ఏది ఎక్కువ ఉంటే వాటి ప్రాతిపదికన లీజు పెంపుదల చేయాలి. కాని కొవ్వూరు మునిసిపాలిటీలో ఏది తక్కువ ఉందో దానిని తీసుకుని లీజు పెంపుదల చేస్తూ మునిసిపల్ ఆదాయానికి అధికారులు గండి కొడుతున్నారు. మునిసిపల్ అధికారులు పట్టణంలో చుట్టుపక్కల అద్దెలను అతి తక్కువ చూపించి పాలకవర్గాన్ని పక్కదారి పట్టించి లీజుదారులకు మేలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో షాపుల అద్దె పట్టణంలో ఎటు చూసినా రూ.10 వేల నుంచి రూ.22 వేలు ఉండగా మునిసిపల్ అధికారులు మెయిన్‌రోడ్‌లో బాపూజీ కూరగాయల మార్కెట్ చుట్టు పక్కల కేవలం రూ.5,333లీజు ఉందని పాలకవర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 15వ తేదీన జరగనున్న కౌన్సిల్ అజెండాకు షాపుల లీజు పొడిగింపును తీసుకొచ్చారు.ఉన్నతాధికారులుపట్టించుకోకపోవడంతో ఇలా ఇష్టారాజ్యం చేస్తున్నారు.ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు, పాలకవర్గం మునిసిపల్ కమర్షియల్ షాపుల అద్దెల లీజులపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.మునిసిపల్ షాపులను లీజుకు ఇచ్చి 10 నుంచి 20 ఏళ్లు పూర్తయిన కారణంగా పట్టణంలో ఉన్న మునిసిపల్ షాపులన్నింటికి కొత్తగా టెండర్లు పిలిచి మునిసిపల్ ఆదాయం పెంపునకు కృషి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.







మంత్రి దుర్గేష్‌కు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఘన స్వాగతం పలుకుతున్న అభిమానులు

నిడదవోలులో సొంతిల్లు తీసుకుంటా : దుర్గేష్

తాను ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో చెప్పినట్టు త్వరలో నిడదవోలులో సొంతిల్లు తీసుకుంటా.. అక్కడే ఎక్కువగా ఉండి ఆ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరంలో కూడా ఉంటానని తెలిపారు.జనసేన అధినేత పవన్ వల్లే మంత్రి అయ్యానన్నారు. పర్యాటక హబ్‌గా గోదావరి ప్రాంతాన్ని తీర్చిదిద్దుతానని, వచ్చే పుష్కరాల నాటికి ఒక రూపు తీసుకొస్తామన్నారు. నన్ను ఆదరించిన నిడదవోలు,జిల్లా ప్రజలకు రుణ పడి ఉంటానన్నారు. కేవలం 45 రోజులే నిడదవోలు ప్రచారం చేశానని.. అందరూ సహకరించి గెలిపించారన్నారు.తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా అన్నంపెట్టే పథకమైన నిడదవోలు పెండ్యాల పంపింగ్ స్కీన్‌ను ప్రారంభించానన్నారు.పిఠాపురం టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి పవన్‌కల్యాణ్‌కు రోడ్‌మ్యాప్ ఉందని, త్వరలో కార్యాచరణ చేపడతామన్నారు. లోకేష్ రెడ్‌బుక్‌లోని అందరి మీద చట్టప్రకారమే చర్యలు ఉంటాయన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 14 : మంత్రి హోదాలో తొలిసారి రాజమహేంద్రవరం విచ్చేసిన కందుల దుర్గేష్‌కు ఘన స్వాగతం లభించింది. అడుగడుగునా జనం హారతులు పట్టారు. ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత, ఎస్పీ జగదీశ్ , జేసీ ఎన్.తేజ్‌భరత్,ఆర్డీవో ఏ.చైత్ర వర్షిణి మంత్రిర దుర్గేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అంద జేసి అభినంద నలు తెలిపారు. పర్యాటక పరంగా జిల్లాలో అవకాశం ఉన్న పలు అంశాలపై కలెక్టర్‌తో మంత్రి చర్చించారు.

పురందేశ్వరికి మంత్రి పదవి రావాలని జైనుల పూజలు

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రజాభిమానంతో ముందుకు సాగిపోవాలని, రాజమహేంద్రవరం ఎంపీ విజేత దగ్గుబాటి పురందేశ్వరికి కేంద్ర మంత్రి పదవి రావాలని ఆకాంక్షిస్తూ జైనులు ప్రత్యేక పూజలు చేశారు.రాజమహేంద్రవరంలోని శ్రీ సుమతీనాథ్ జైన్ శ్వేతాంబర్, శ్రీ సుమతీనాథ్ వాసబూజ్య జైన్ మందిరాల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం జైన సంప్రదాయాలను అనుసరించి పూజలు చేశారు. నూతనంగా పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కందుల దుర్గేశ్, రాజమండ్రి సిటీ, రూరల్ ఎమ్మెల్యే విజేతలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దినేశ్ కుమార్ జైన్, హేమరజ్జి జైన్, భేరూలాల్ జైన్, రాజేంద్ర షరాఫ్, గున్వంత్ జైన్, సంజయ్ విజావత్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న జైనులు

పొట్టకూటి కోసం వెళ్లి పరలోకానికి..

- కృష్ణా జిల్లా రోడ్డు ప్రమాదంలో కోనసీమ జిల్లావాసులు నలుగురి మృతి
- కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడికి చెందిన మరొకరు మృత్యువాత
- మరో అయిదుగురికి తీవ్ర గాయాలు
- ఎస్.యానాం, గెద్దనపల్లి, గొర్రిపూడి గ్రామాల్లో తీవ్ర విషాదచాయలు

ఉప్పలగుప్తం, జూన్ 14: కృష్ణా జిల్లా కృత్తివెన్ను వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంకు చెందిన రేవు భూషణం (26), పెసంగి కనకరాజు (32) అక్కడికక్కడే మృతి చెందారు. కాట్రేనికోన మండలం గెద్దనపల్లికి చెందిన చింతా లోవరాజు, మాగాపు నాగరాజు మృతి చెందగా, తీవ్రగాయాలపాలైన చింతా దుర్గాప్రసాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరితోపాటు ప్రయాణిస్తున్న యువకులు రేవు జ్ఞానేశ్వరరావు, సంగాని నాగేంద్రబాబు, మల్లాడి శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా చేపల పట్టుబడి కోసం కాకినాడ జిల్లా తాళ్లరేవు నుంచి బొలెరో వాహనంలో వెళ్తుండగా చేపల కంటైనర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఎస్.యానాం, గెద్దనపల్లిలో విషాదచాయలు నెలకొన్నాయి. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పని కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు...

కుటుంబాలను పోషించుకునేందుకు రోజూ మాదిరిగానే ఇంటి నుంచి బయలుదేరారు. శుక్రవారం ఉదయమే కుటుంబ సభ్యులకు విషాద వార్త అందింది. దీంతో ఎస్.యానాంలో విషాదం నెలకొంది. ప్రతిరోజూ రాత్రి ఎస్.యానాం నుంచి కొందరు యువకులు చేపల పట్టుబడికి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. పలు గ్రామాల నుంచి తాళ్లరేవు వెళ్లి అక్కడి నుంచి అందరూ కలిసి చేపల పట్టుబడి ప్రాంతాలకు వాహనాలపై వెళ్తారు. గురువారం అర్ధరాత్రి అదే విధంగా 12 మంది బొలేరో వాహనంలో బయలుదేరి వెళ్లారు. ఆ ప్రయాణమే కొందరికి ఆఖరి పయనం అయ్యింది. కాగా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంకు చెందిన మృతుడు రేవు భూషణానికి ఏడాది కిందటే వివాహమైంది. అతడి భార్య జ్యోతి గర్భవతి. మరో మృతుడు కనకరాజుకు భార్య, కూతురు ఉన్నారు. రోజూ మాదిరిగానే ఇంటికి అవసరమైన సామగ్రి తీసుకుని వస్తారని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులను ఇక తమవారు లేరన్న సమాచారం నిలువునా కుంగదీసింది. మృతుల కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కనకరాజు పిల్లలు తండ్రి కోసం పదేపదే అడుగుతుంటే ఇరుగుపొరుగు వారు సముదాయించలేక కన్నీరు పెట్టుకుంటున్నారు. గర్భవతిగా ఉన్న జ్యోతి తన భర్త ఇక లేడన్న వార్తను జీర్ణించుకోలేక విలపిస్తున్న తీరు వర్ణనాతీతం. ఎంపీటీసీ పెట్టా అప్పారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, లంకే చిరంజీవిలు ప్రమాదస్థలికి వెళ్లి పర్యవేక్షించారు.

పిల్లలకు, తల్లికి.. దిక్కెవరు?

కాట్రేనికోన, జూన్ 14: ఇదే ప్రమాదంలో కాట్రేనికోన మండలం గెద్దనాపల్లికి చెందిన మాగాపు నాగరాజు మృతితో అతని కుమారుడు సతీష్, కుమార్తె చంద్రికశ్రీ, తల్లి సూర్యకాంతం దిక్కులేనివారయ్యారు. ప్రేమ వివాహం చేసుకున్న నాగరాజు మనస్పర్థల కారణంగా విడాకులు తీసుకున్నాడు. దీంతో కుమార్తె చంద్రిక తండ్రి వద్ద, కుమారుడు సతీష్ తల్లి వద్ద ఉంటున్నారు. వృద్ధురాలైన తల్లి నాగరాజు వద్ద ఉంటోంది. రాత్రి వరకు తన ముందు కదలాడిన కుమారుడు మృతి చెందాడన్న విషయాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతోంది. తండ్రి ఎప్పుడు తిరిగివస్తాడని కుమార్తె అమాయకంగా అడుగుతోంది. నాగరాజు కూలిపనితో జీవిస్తుండగా, ఇప్పుడా కుటుంబం జీవనాధారం కోల్పోయింది. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన చింతా లోవరాజు మృతి వార్త విన్న అతడి భార్య విజయ, తల్లిదండ్రులు సత్యనారాయణ, గంగాయమ్మ కుప్పకూలిపోయారు. లోవరాజు కుమార్తె దేవిశ్రీ, కుమారుడు హేమంత్ విషయం అర్థం కాక బేలచూపులు చూస్తున్నారు. మత్స్యకారులైన వీరికి చేపలవేటే ఆధారం. వేటలేని సమయంలో చేపల ప్యాకింగ్, ఇతర పనులకు వెళ్లి లోవరాజు కుటుంబ పోషణ చేస్తుంటాడు. ఈ సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. చేతికి అందివచ్చిన కుమారుడి మరణంతో వృద్ధులైన తల్లిదండ్రులు, చిన్న వయసులో భర్త మరణించడంతో ఇద్దరు పిల్లలతో ఎలా జీవించాలంటూ లోవరాజు భార్య విజయ బోరున విలపించడం అందరినీ కలచి వేసింది.


గెద్దనపల్లిలో రోదిస్తున్న లోవరాజు భార్య, పిల్లలు

కృత్తివెన్ను రోడ్డు ప్రమాదంలో గొర్రిపూడి వాసి మృతి

కరప, జూన్14: రెక్కాడితే గాని డొక్కాడని బతుకులను రోడ్డు ప్రమాదం చిదిమేసింది. కుటుంబాలకు ఆధారభూతమైన వారిలో ఒకరిని మృత్యువు కబళించగా, మరొకరు తీవ్రగాయాలతో ఆసుపత్రిపాలయ్యాడు. దీంతో రెండు కుటుంబాలు రోడ్డునపడి గ్రామంలో తీవ్ర విషాదచాయలు అలముకున్నాయి. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన గండి ధర్మవరప్రసాద్ (27) మృత్యువాత పడగా, మేడిశెట్టి మహేష్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గొర్రిపూడి గ్రామానికి చెందిన ధర్మవరప్రసాద్, మహేష్‌కుమార్ ఒక చేపల కంపెనీలో పనిచేస్తున్నారు. ధర్మవరప్రసాద్ డ్రైవర్‌గాను, మహేష్‌కుమార్ గుమస్తాగాను విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మరో తొమ్మిది మందితో కలిసి కృత్తివెన్ను మండలం మునిపెడ గ్రామంలో చేపల పట్టుబడికి బొలెరో వాహనంలో బయలుదేరి వెళ్లారు. సీతనపల్లి వద్ద పుల్లల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తూ ముందున్న కంటైనర్‌ను వీరు ప్రయాణిస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ధర్మవరప్రసాద్‌తో పాటు మరో ఐదుగురు మృత్యువాతపడ్డారు. మహేష్ కుమార్ తలకు, నడుముకు తీవ్రగాయాలయ్యాయి. రోడ్డుప్రమాద విషయం తెలిసిన వెంటనే గొర్రిపూడి నుంచి రెండు కుటుంబాలకు చెందిన పలువురు ఘటనాస్థలికి చేరుకున్నారు. ధర్మవరప్రసాద్ మృతిచెందిన విషయం తెలుసుకుని కుటుంబసభ్యులు బోరున విలపించారు. అతడికి ఏడాదిన్నర పాప, భార్య వరలక్ష్మి ఉండగా ఆమె ప్రస్తుతం నిండు గర్భిణి. తండ్రి సత్యనారాయణమూర్తి దివ్యాంగుడు కాగా, తల్లి వరలక్ష్మి వినికిడిలోపం సమస్యతో బాధపడుతోంది. వీరితోపాటు వృద్ధాప్య దశలో ఉన్న తాత ధర్మారావు బాధ్యతలు కూడా మృతుడు ధర్మవరప్రసాద్ చూసుకుంటున్నాడని, ఇప్పుడు తమకెవరు దిక్కంటూ బాధితుల ఆక్రందనలు చూపరులను కంటతడి పెట్టిస్తున్నాయి. మరోపక్క భర్త చనిపోయిన విషయం పుట్టింట్లో ఉంటున్న అతని భార్యకు ఎలా చెప్పాలి దేవుడా అంటూ కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. ఇక ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహేష్‌కుమార్ క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నారు.


కరప మండలం గొర్రిపూడిలో మృతుడి ఇంట రోదిస్తున్న కుటుంబ సభ్యులు


కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో నాగరాజు ఇంటి వద్ద విషాదచాయలు

మేనల్లుడి చేతిలో మేనమామ హతం

నాపరాయితో కొట్టి చంపిన వైనం



వరప్రసాద్.. మృతదేహం

పిఠాపురం రూరల్, జూన్ 14: మేనల్లుడి చేతిలో మేనమామ హతమయ్యాడు. నాపరాయితో కొట్టి హతమార్చిన ఘటన పిఠాపురం మండలం భోగాపురంలో సంచలనం కలిగించింది. గ్రామానికి చెందిన బ్రహ్మదేవపు వరప్రసాద్(44), నాగులాపల్లి పద్మరాజులు వరుసకు మేనమామ, మేనల్లుడు. వీరిద్దరు తాపీ పనికి వెళుతూ తమ కుటుంబాలను పోషించుకుంటారు. వీరి కుటుంబాల మధ్య కొంతకాలంగా కలహాలు ఉన్నాయి. గురువారం రాత్రి పనికి వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత వీరిద్దరి మధ్య కూలీ డబ్బుల విషయంలో ఘర్షణ జరిగింది. అనంతరం ఎవరికి వారు వెళ్లిపోయారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట సమయంలో గుడిలో నిద్రిస్తున్న వరప్రసాద్‌ను పద్మరాజు నాపరాయితో కొట్టి హత్య చేశాడు. దీంతో రక్తపు మడుగులో పడి వరప్రసాద్ అక్కడిక్కడే మరణించాడు. పద్మరాజు పరారయ్యాడు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వరప్రసాద్ సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సముద్రంలో స్నానానికి దిగి యువకుడు మృతి

ఉప్పలగుప్తం, జూన్ 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్‌లో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు ఒక యువకుడు మృతి చెందాడు. మృతి చెందిన యువకుడిని విశాఖపట్నానికి చెందిన అనుదీప్(24)గా గుర్తించారు. ఎస్.యానాంలో ఒక ఓఎన్జీసీ ఉద్యోగిని కలుసుకునేందుకు ముగ్గురు యువకులు విశాఖ నుంచి శుక్రవారం వచ్చారు. వీరు బీచ్‌లో స్నానం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అనుదీప్ సముద్రంలో తేలుతుండగా వెంటనే ఒడ్డుకు తీసుకువచ్చి కెయిర్న్ అంబులెన్స్‌లో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారణ కావడంతో వెంటనే విశాఖకు తరలించారు. శుక్రవారం 11-12 గంటల మధ్య ఈ ప్రమాదం జరిగిందని, తమకు సమాచారం తెలిసిన వెంటనే అమలాపురం ఆసుపత్రికి వెళ్లగా అప్పటికే మృతదేహాన్ని విశాఖ తరలించారని వీఆర్వో అవిడి రాము చెప్పారు.

ఆడుకునేందుకు ఆటో కిందకు.. గమనించకుండా ముందుకు నడిపిన డ్రైవర్

నాలుగేళ్ల బాలుడు దుర్మరణం



పిఠాపురం రూరల్, జూన్14: ఆటలు ఆడుకుంటూ ఆటో కిందకు దూరాడు నాలుగేళ్ల బాలుడు. అది గమనించకుండా ఆటోను డ్రైవర్‌కు ముందుకు నడపడంతో కిందపడి అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషాదకర ఘటన పిఠాపురం మండలం పి.దొంతమూరులో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కుక్కల అశ్విన్(4) శుక్రవారం ఆడుకుంటూ ఉన్నాడు. అదే సమయంలో గ్రామంలో ఉప్పు అమ్ముతూ వచ్చిన ఆటో అక్కడ ఆగింది. అశ్విన్ ఆడుకుంటూ ఆటో కిందకు వెళ్లాడు. అది గమనించని డ్రైవర్ ఆటోను ముందుకు నడిపాడు. దీంతో ఆటో కింద ఉన్న అశ్విన్ మీదుగా వెళ్లడంతో అక్కడిక్కడే మరణించాడు. తండ్రి వెంకట్రావు కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తాడు. అశ్విన్‌కు రెండేళ్ల తమ్ముడు ఉన్నాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌కు గురై భవన నిర్మాణ కార్మికుడు మృతి

నేరేడు చెట్టు ఎక్కడంతో విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం



ప్రత్తిపాడు, జూన్14: నేరేడు పండ్ల కోసం చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ధర్మవరంనకు చెందిన బెజవాడ భాస్కరరావు (39) భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం నేరేడు పండ్ల కోసం చెట్టు ఎక్కి పండ్లు కోస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై చెట్టు మీద నుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న భాస్కరరావును స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. భాస్కరరావుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భవన నిర్మాణ కార్మికుడుగా రోజువారీ పనులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న భాస్కరరావు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో అతని కుటుంబం జీవనాధారం కోల్పోయింది. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరేడు చెట్టు నుంచి జారి పడి యువకుడి మృతి



రాజానగరం, జూన్14: నేరేడు చెట్టు ఎక్కి పండ్లు కోస్తుండగా చెట్టు కొమ్మ విరిగిపడి ఒక యువకుడు మృతిచెందాడు. రాజానగరం మండలం పాలచర్ల గ్రామానికి చెందిన దేవాబత్తుల శివనాగ దుర్గ (27) పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం నేరేడు చెట్టు ఎక్కి పండ్లు కోస్తుండగా కొమ్మ విరిగిపోవడంతో ప్రమాదవశాత్తూ కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా దుర్గ భార్య కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.



లారీ యాజమానులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు.. పక్కన బండారు స్వామి (ఫైల్‌ఫొటో)

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రౌతులపూడి, జూన్14: వివాహమై సంవత్సరం అయ్యింది. హాయిగా సాగిపోతున్న కాపురంలో లారీ రూపంలో మృత్యువు వచ్చి భర్తను పొట్టనబెట్టుకుంది. భార్య ఒంటరికాగా, ఒక్కగాన ఒక్క కొడుకు మృతితో తల్లిదండ్రుల ఆర్తనాదాలతో ఆ గ్రామం శోకసంద్రంలో మునిపోయింది. రౌతులపూడి మండలం పారుపాక గ్రామానికి చెందిన బండారు స్వామి (21) తుని వేళ్లే రహదారిలోని మామిడితాండ్ర ఫ్యాక్టరీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంవత్సరం కిందట పారుపాక గ్రామానికి చెందిన పార్వతితో వివాహమైంది. ఫ్యాక్టరీలో పని ముగించుకుని వస్తుండగా తేటగుంట- తుని సెంటర్‌లో క్వారీ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త మృతి చెందిన విషయం తెలిసిన భార్య బండారు పార్వతితో పాటు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కడే కొడుకు కావడం, సంవత్సరం కిందటే వివాహం కావడంతో తల్లిదండ్రులు రోదనకు అంతు లేకుండా పోయింది. కాగా ఈ ప్రమాదంలో స్వామి మృతికి కారణమైన లారీ యాజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. లారీలు ఈ రహదారిలో వేగంగా నడుపుతున్నారని, ఇలా ఎంతమందిని చంపేస్తారంటూ గ్రామస్తులు నిలదీశారు. రౌతులపూడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

కొమ్మనాపల్లిలో అదుపులోకి రాని డయేరియా

- మహిళ మృతి
- ఎమ్మెల్యే దివ్య పరామర్శ
- జిల్లా అధికారుల సందర్శన
- ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరా
- కారణం నిర్ధారించని అధికారులు



రోగుల్ని పరామర్శిస్తున్న యనమల దివ్య (కింద) మృతి చెందిన నాగమణి

తొండంగి, జూన్14: కొమ్మనాపల్లిలో ప్రబలిన డయేరియా వ్యాధి ఇంకా అదుపులోకి రాలేదు. శుక్రవారం కొత్తగా మరో 11 కేసులు నమోదయ్యాయి. దొడ్డి నాగమణి (35) అనే మహిళ డయేరియా వ్యాధితో మృతి చెందడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. నాగమణికి వాంతులు అవుతుండడంతో శుక్రవారం ఉదయం సీతంపేట ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మరణించింది. నాగమణికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతితో గ్రామంలో ఆందోళన నెలకొంది. కొత్తగా నమోదైన కేసులతో ఇప్పటివరకూ అధికారికంగా 34 కేసులు నమోదైనప్పటికీ ఇంకా పలువురు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్టు గ్రామస్తులు తెలుపుతున్నారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతిలు చికిత్స అందిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి రోగుల్ని గుర్తిస్తున్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి బ్లీచింగ్ క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. సచివాలయంలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇప్పటికే సుమారు 10 మందిని అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వైద్య శిబిరం వద్ద అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. జిల్లా వైద్యాధికారి నర్సింహనాయక్, జిల్లా పంచాయతీ అధికారి సౌజన్యలు గ్రామంలో పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వాటర్ శాంపిళ్లు సేకరించి పరీక్షకు పంపినట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాస్ తెలిపారు.

రోగులు ధైర్యంగా ఉండాలి: ఎమ్మెల్యే దివ్య

డయేరియా రోగులు మనోధైర్యంతో ఉండాలని తుని ఎమ్మెల్యే దివ్య అన్నారు. శుక్రవారం ఆమె కొమ్మనాపల్లి వైద్య శిబిరంలో రోగుల్ని పరామర్శించారు. జిల్లా వైద్యాధికారి నర్సింహనాయక్, ఎస్ఈ శ్రీనివాస్ తదితర అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. అవసరమైతే తక్షణం కాకినాడ తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించామన్నారు. టీడీపీ నాయకులు యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, కోడ వెంకటరమణ ఆమె వెంట ఉన్నారు. కాగా గ్రామంలో డయేరియా వ్యాధి ప్రబలడానికి ఆహారం లేదా నీటి కాలుష్యం కారణంగా ఏర్పడి ఉండవచ్చని జిల్లా వైద్యాధికారి నాయక్ తెలిపారు. రోగుల శరీరంలో ఇన్‌ఫెక్షన్ స్థాయి అధికంగా ఉండడం వల్ల ప్రధానంగా కలుషిత ఆహారం భుజించి ఉండవచ్చన్నారు. నీటి శాంపిళ్లు సేకరించి పరిశీలించామని, శాంపిళ్లను కాకినాడ ల్యాబ్‌కు కూడా పంపి పరీక్ష చేయిస్తామన్నారు. అంతవరకూ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. పైప్‌లైన్ల లీకుల కారణంగా డ్రైనేజీ వాటర్ తాగునీటిలో కలిసి వ్యాధి ప్రబలి ఉండవచ్చని పలువురు అధికారులకు తెలపగా అటువంటిది లేదన్నారు. ఆర్డీవో సీతారామాంజనేయులు, డీఎల్‌పీవో గ్రామాన్ని సందర్శించారు.



పోటీల్లో పరుగులు తీస్తున్న ఎడ్ల బండి.. ప్రథమ బహుమతి అందజేస్తున్న తమ్మయ్యబాబు

రాష్ట్ర స్థాయి ఎడ్లపోటీల్లో విజేతలు వీరే

ఏలేశ్వరం, జూన్14: మండలంలోని తిరుమాలి గ్రామంలో నేరేళ్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రస్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎడ్లబళ్ల పోటీలకు సీనియర్ విభాగంలో 7జతలు, జూనియర్ విభాగంలో 27 జతలు పాల్గొన్నాయి. వీటిలో సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అనకాపల్లి జిల్లా లంకెవానిపాలెం గ్రామానికి చెందిన శ్రీపైడితల్లి అమ్మ, మండపేట గ్రామానికి చెందిన పెనుమర్తి బొబ్బిలి రాజు, కొవ్వాడ గ్రామానికి చెందిన మట్లాన వనీత్ శ్రీమణికంఠ వారి ఎడ్లు గెలుపొందగా, జూనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కొప్పవరం గ్రామానికి చెందిన బండారు శ్రీను, దుళ్ల గ్రామానికి చెందిన తూము శ్రీను, కొవ్వాడ గ్రామానికి చెందిన మట్లాన వనీత్ శ్రీమణికంఠ ఎడ్లు కైవసం చేసుకొన్నాయి. సీనియర్స్‌కి నగదు ప్రథమ బహుమతి రూ.12 వేల నగదుతోపాటు మెమోంటో, ద్వితీయ బహుమతి రూ.10వేలు నగదుతోపాటు మెమోంటో, తృతీయ బహుమతి రూ.8 వేల నగదుతోపాటు మెమోంటో, జూనియర్స్‌కి నగదు ప్రథమ బహుమతి రూ.10 వేల నగదుతోపాటు మెమోంటో, ద్వితీయ బహుమతి రూ.8 వేల నగదుతోపాటు మెమోంటో, తృతీయ బహుమతి రూ.6 వేల నగదుతోపాటు మెమోంటో ప్రత్తిపాడు జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణరాజు (మీసాల రాజు) చేతుల మీదుగా బహుమతులు, నగదు ప్రదానం అందజేశారు. ఈ నగదు, బహుమతులు, జ్ఞాపికలు చందువోలు నాగరాజు జ్ఞాపకార్థం వారి కుమారుడు చందువోలు రాజా, చింతపల్లి వరహాలు జ్ఞాపకార్థం వారి కుమారుడు సూర్యనారాయణ, కోలా వీరబాబు, కోరుకొండ రుద్రయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు కోరుకొండ నూకరాజు, తిరుమాలి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కానూరి బ్రహ్మానందం, మాడెం పెంటయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు ధర్మరాజు, పసల సూరిబాబు, ఓలేటి చంటిబాబు, సూతి అప్పలరాజు అందజేశారు.

రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందింది

జనసేన నియోజకవర్గాల్లో డొక్కా సీతమ్మ క్యాంటిన్లు ఏర్పాటుచేయాలి

శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధి హీన్

పి.గన్నవరం, జూన్ 14: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా నడిచిన రాక్షసపాలన అంతమొందిందని శ్రీలంక బౌద్ధభిక్షువు బోధి హీన్ అన్నారు. ఏపీలో కూటమి పాలన వస్తుందని ఈనెల 3న తెలంగాణలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో తాను వెల్లడించడం జరిగిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకలగన్నవరంలో ఆయన డొక్కా సీతమ్మ నివాసాన్ని సందర్శించి అనంతరం మాట్లాడారు. అన్నక్యాంటీన్‌లను స్వాగతిస్తున్నామని, ఎన్నికల సమయంలో పవన్‌కల్యాణ్ డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, ఆమేరకు జనసేన గెలిచిన 21 నియోజకవర్గాల్లో సీతమ్మ క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు ఆయన తెలిపారు. కుల, మతాలకు అతీతంగా భోజనాలు అందించిన ఘనత సీతమ్మకు ఉందని ఆయన గుర్తుచేశారు. పవన్‌కల్యాణ్‌కు శ్రీలంకలో భారీగా అభిమానులు ఉన్నారని, ముఖ్యంగా బౌద్ధ భిక్షువులు, ఉపాసకులలో ఎక్కువ శాతం అభిమానులు ఉన్నారన్నారు. అమరావతి అనే పేరు బౌద్ధమతం నుంచే పుట్టిందన్నారు. ఎన్నికల సమయంలో శ్రీలంక నుంచి వచ్చిన పలువురు బౌద్ధ భిక్షువులు అమరావతి తోపాటు రాష్ట్రమంతా పర్యటించామన్నారు. ముఖ్యంగా అమరావతి రైతులను కలిసి కూటమి ప్రభుత్వం వస్తుందని ధైర్యం చెప్పామన్నారు. త్వరలో నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపేందుకు ఏపీ రాజధాని అమరావతికి శ్రీలంక నుంచి బౌద్ధ భిక్షువులు, బౌద్ధ ఉపాసకులు రాబోతున్నారని ఆయన తెలిపారు. వారందరూ సీఎం చంద్రబాబునాయుడిని కలిసి రాష్ట్రంలో ఉన్న 13 ఉమ్మడి జిల్లాలను కలిపి ఒక కేడర్‌గా ఏర్పాటుచేసి, బౌద్ధాన్ని తద్వారా టూరిజాన్ని అభివృద్ధి చేయాలని కోరతారన్నారు.


లంకలగన్నవరం డొక్కా సీతమ్మ నివాసంలో సీతమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధి హీన్

జెన్కో చీఫ్ ఇంజనీర్‌గా జవహర్


బాధ్యతలు చేపడుతున్న దృశ్యం

మోతుగూడెం, జూన్14: చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్‌గా జవహర్‌ను పదోన్నతిపై నియమిస్తూ విజయవాడ విద్యుత్ సౌధ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఉన్న బొడ్డు శ్రీధర్‌ను విద్యుత్ సౌధలోని ట్రైనింగ్ సెంటర్‌కి బదిలీ చేశారు. నూతనంగా నియమితులైన జవహర్‌ను ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ సివిల్ క్షేత్రశాంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ వరప్రసాద్, డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.విజయ్‌కుమార్ పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతించారు.


ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రియ

జీవవైవిధ్యం మానవాళికి మూలాధారం

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రియ

దివాన్‌చెరువు, జూన్ 14: జీవవైవిధ్యం మానవాళికి మూలాధారమని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ అన్నారు. గుంటూరులోని రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సౌజన్యంతో జీవ వైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణా కార్యక్రమం లాలాచెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాల్లో తెలియజేసి, తద్వారా వారిని జీవవైవిధ్య పరిరక్షణలో భాగస్వాములను చేయాలని కోరారు. జీవవైవిధ్యంపై అవగాహన, దానిని పరిరక్షించుకోవలసిన అవసరం, జీవవైవిధ్యం చట్టాలను వివరించడం ముఖ్యోద్దేశంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. రెండురోజులు పాటు జరిగే ఈ కార్యక్రమానికి తొలిరోజు రంపచోడవరం, విశాఖపట్టణం, విజయనగరం, చీరాల తదితర ప్రాంతాల నుంచి యాజమాన్య కమిటీ సభ్యులు హాజరయ్యారు. అలాగే అకాడమీ అధికార్లు వి.శ్రీహరిగోపాల్, ఎస్వీ శివరాంప్రసాద్, ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి ప్రాంతీయ కోఆర్డినేటర్లు జానకిరామ్, చెన్నకేశవ, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని కాపాడిన గూడ్స్‌రైలు డ్రైవర్

అన్నవరం, జూన్ 14: కుటుంబకలహాలు, ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో రైలుపట్టాలపై పడుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధుడిని గూడ్స్ రైలు డ్రైవర్ అప్రమత్తతో వ్యవహరించి సడన్ హ్యాండ్‌బ్రేక్ వేసి అతనిని కాపాడిన ఘటన అన్నవరం రైల్వేస్టేషన్‌లో జరిగింది. చిన్నయ్యపాలెంకు చెందిన పసుపులేటి గంగరాజు (82) దొడ్డిగొల్లులో నివాసం ఉంటుండగా అన్నవరం రైల్వేస్టేషన్ పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సామర్లకోట వైపు వెళుతున్న గూడ్స్‌రైలు డ్రైవర్ గమనించి సడన్ బ్రేక్ వేశారు. విషయాన్ని స్టేషన్‌మాస్టర్ రైల్వే ఎస్.ఐ మారూఫ్‌కు సమాచారమిచ్చారు. రైల్వే హెచ్‌సీ శ్యామ్, ఉపేంద్రలు అన్నవరం చేరుకుని వారి వివరాలతో వృద్ధుడిని కుటుంబసభ్యులకు అప్పగించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

రాజవొమ్మంగి జూన్ 14: రాజవొమ్మంగి మండలంలో శుక్రవారం వర్షం వస్తుందని చెట్టు కింద ఆగిన వ్యక్తి మృత్యువాత పడిన ఘటన ఇది. లాగరాయి గ్రామానికి చెందిన కొల్లి నాగబాబు (30), పెంటకోట దేవకిరణ్ (23) ఏలేశ్వరం నుంచి లాగరాయి వెళుతూ మార్గమధ్యలో వర్షం వస్తోందని లబ్బర్తి గ్రామ సమీపంలో చెట్టు కింద ఆగారు. కాసేపటికి చెట్టుపై పిడుగు పడడంతో నాగబాబు అక్కడికక్కడే మృతి చెందగా, కిరణ్‌కు గాయాలవడంతో స్థానికులు లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏజెన్సీ సమాచారం



ఎటపాకలోని ప్రధాన రహదారిపై పడిన భారీ వృక్షం

ఎటపాకలో భారీ వర్షం.. రహదారిపై కూలిన భారీవృక్షం

ఎటపాక, జూన్14 :ఎటపాకలో శుక్రవారం సాయంత్రం గాలిదుమారంతో భారీవర్షం కురిసింది. ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు నేలకూలాయి. భద్రాచలం- చర్ల ప్రధాన రహదారిపై ఎటపాక వద్ద భారీ వృక్షం కూలి రహదారిపై పడింది. దాంతో భద్రాచలం- చర్ల వెళ్లే భారీ వాహనాల రాకపోకలు సుమారు మూడు గంటలపాటు నిలిచిపోయాయి. అనేక మంది వాహనదారులు ఈ రహదారి వైపు వెళ్లే సమయంలో ఇబ్బందులు పడ్డారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి





రాజవొమ్మంగి మండలం లబ్బర్తి సమీపంలో చెట్టు కింద నిలుచోగా పిడుగుపడి మృతిచెందిన నాగబాబు మృతదేహం - వార్త 7లో

ఒకే రోజు ఐదు సంతకాలు ఓ చరిత్ర : ఎమ్మెల్యే శిరీష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజేత శిరీషా దేవి

రాజవొమ్మంగి, జూన్14: ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రోజునే ఐదు ఫైళ్లపై సంతకాలు చేసిన ముఖ్యమంత్రులు చరిత్రలో ఎవరూ లేరని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. శుక్రవారం రాజవొమ్మంగి టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాయకులు ఎన్నికలకు రెండు నెలల ముందు డీఎస్సీ తీస్తున్నామంటూ నిరుద్యోగులను మభ్యపెట్టారని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన మొదటి రోజే మెగా డీఎస్సీ తీసే ఫైల్‌పై ముఖ్యమంత్రి సంతకం చేశారన్నారు. అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్నాక్యాంటీన్ల ప్రారంభం, పింఛన్ల పెంపు, స్కిల్ సెన్సస్ నిర్ణయాలపై కూడా చంద్రబాబు సంతకాలు చేశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో అర్హత ఉన్న అనేకమందికి పెన్షన్ లేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో రంపచోడవరం నియోజకవర్గవ్యాప్తంగా అర్హత కలిగిఉన్న ప్రజలకు పెన్షన్ ఇప్పించే బాధ్యత తనదని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, కూటమి పార్టీల నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

కోచింగ్ ఇచ్చేందుకు కృషి చేయండి

గిరిజన ప్రాంతంలో అనేకమంది యువతీయువకులు డీఎస్సీ కోసం వేచిచూస్తున్నారని, టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజే మెగా డీఎస్సీ తీసి నిరుద్యోగులకు ప్రాణం పోశారని నిరుద్యోగులు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి విన్నవించారు. గిరిజన ప్రాంతంలో అభ్యర్థులు డీఎస్సీకి ప్రిపేర్ అయ్యేందుకు ప్రభుత్వం ద్వారా కోచింగ్ సెంటర్ ఏర్పాటుచేయాలని నిరుద్యోగుల తరుపున సింధు అనే యువతి ఎమ్మెల్యేను కోరింది. దీనిపై ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ కోచింగ్ ఏర్పాటుచేసేలా ప్రయత్నిస్తామన్నారు.

ఐదు సంతకాలతో అందరింటా సంబరాలు

మోతుగూడెం, జూన్14: చింతూరు మండలం మోతుగూడెం జగదాంబ సెంటర్ సెకండ్ రింగ్ రోడ్‌లో టీడీపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించి తొలిరోజే ఐదు సంతకాలతో హామీలను నెరవేర్చడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తలకు భోజనాలు ఏర్పాట్లుచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ధారబాబు, అంగ శ్రీను సాయి, రాంప్రసాద్, యేసు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వైద్యాధికారులకు శిక్షణ

రంపచోడవరం, జూన్ 14: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో శుక్రవారం రెండో రోజు వైద్యాధికారులకు చెవి, ముక్కు, గొంతు, నోటి, గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌కు సంబంధించి స్క్రీనింగ్ టెస్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ జామలబాషా, డీఎంహెచ్‌వో కృష్ణారావు, ఏడీఎంహెచ్‌వో శిరీష, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి : ఐటీడీఏ పీవో

రంపచోడవరం, జూన్ 14: ఏజెన్సీలో గిరిజన సంక్షేమశాఖ ద్వారా చేపట్టిన పనులు నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన తన కార్యాలయ చాంబరులో గిరిజన సంక్షేమశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీవో మాట్లాడుతూ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలన్నారు. ఈఈ జి.డేవిడ్‌రాజ్, డీఈఈ చైతన్య, డీఈలు నాగరాజు, గౌతమి, ఏఈలు సత్యనారాయణ, భాను, వీరభద్రరావు పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు మన్‌స్ట్రల్ కప్స్ అందజేత

కూనవరం, జూన్14: మండలంలోని భగవాన్‌పురం గ్రామంలోని గిరిజన మహిళలకు మన్‌స్ట్రల్ కప్పులను చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అందజేశారు. వెలుగు సెర్ప్ ద్వారా వీటిని అందించారు. చింతూరు డివిజన్‌లో తొలిసారిగా కొత్త మార్పుకు శ్రీకారం చుట్టారు. ఆడవారికి నెలసరి సమయంలో శానిటరీ పాడ్స్, క్లాత్ వాడుతుంటారని, కొంత అసౌకర్యంతోపాటు సమస్యలు తలెత్తుతాయన్నారు. వీటి స్థానంలో మన్‌స్ట్రల్ కప్స్ అందుబాటులోకి వచ్చాయని వీటిని మెట్రో నగరాల్లో మాత్రమే ఉపయోగిస్తారని, మొదటిసారిగా ఏజెన్సీకి పరిచయం చేయడం జరిగిందన్నారు. దీనికి సంవత్సరమంతా రూ.250 మాత్రమే ఖర్చవుతుందని సౌకర్యంగా ఉంటుందన్నారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవన్నారు. వీటిని ఐదు నుంచి పది సంవత్సరాలు ఉపయోగించుకోవచ్చన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పుల్లయ్య, గైనకాలజిస్టు డాక్టర్ శ్వేత, ఏపీడీ శ్రీనివాసరావు లు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

కూనవరం, జూన్14: చంద్రబాబునాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తే, రంపచోడవరం నియోజకవర్గంలో మిరియాల శిరీషాదేవి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే స్థానిక కనకదుర్గాలయంలో 101 కొబ్బరి కాయలు కొడతామని టీడీపీ నాయకులు మొక్కుకున్నారు. వారి కోరిక నెరవేరడంతో శుక్రవారం ఆలయం వద్ద తమ మొక్కును తీర్చుకున్నారు. హెచ్.రాము ఆధ్వర్యంలో చెలకాని ఉమామహేశ్వరరావు, డీకొండ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

చింతూరు, జూన్14: ఐదు సంతకాలతో హామీలను నెరవేర్చిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి శుక్రవారం పార్టీ కార్యాలయంలో పాలభిషేకం నిర్వహించారు. ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ఇచ్చిన హామీల్లో భాగంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మొదటి సంతకం చేయడం అభినందనీయమని టీడీపీ మండలాధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి అన్నారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి

సీతానగరం, జూన్ 14: పర్యావరణంపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ గౌరీశంకర్ సూచించారు. సీతానగరం జడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. ఎంఈవో స్వామినాయక్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 19 వరకు పాఠశాలల్లో పలు అంశాలపై కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.సతీష్‌బాబు, పీడీ సింహాద్రి శంకర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజమహేంద్రిని క్లీన్ సిటీగా తీర్చిదిద్దండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరంలో పారిశుధ్యంపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 14 : రాజమహేంద్రవరాన్ని ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో అన్ని డివిజన్లలో క్షేత్రస్థాయిలో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై శుక్రవారం సమీక్షించారు. పారిశుధ్యపరంగా ప్రజలు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కారణంగా నగరంలో ముంపుప్రాంతాలకు విముక్తి కలిగించడం కోసం చేపట్టాల్సిన పనులపై పలు సూచనలు చేశా రు. చౌడేశ్వరనగర్, కోరుకొండ రోడ్డు, జెఎన్ రోడ్డు, కంబాలచెరువు తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థలో ఉన్న లోపాలపై చర్చించారు. కొన్ని మార్పులు చేయడం ద్వారా వచ్చే ఫలితాలను వివరించారు. నరంలో పందులు, కుక్కల సమస్యకు పరిష్కారంపై సలహాలు ఇచ్చారు. నగరంలో దోమలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పలు డివిజన్లకు చెందిన ఇన్‌చార్జిలు రెడ్డి మణేశ్వరావు, కంటిపూడి శ్రీనివాసరావు, మరుకుర్తి రవియాదవ్, శెట్టి జగదీష్, యిన్నమూరి రాంబాబు, బుడ్డిగ రవి, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, అగురు ధనరాజు సమస్యలను వివరించారు. అన్నింటిపైన కమిషనర్ దినేష్ కుమార్ స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. క్లీన్ అండ్ హెల్త్ సిటీగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు స్వచ్ఛత ర్యాంకింగ్‌లో మన నగరాన్ని దేశంలో 91 నుంచి 54కు తీసుకువచ్చామని ఈ సారి టాప్ 20వ స్థానానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ సత్యవేణి, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, ఉర్లంకల లోకేష్, శానిటరీ సూపర్ వైజర్ ఐ.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెకర్లు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్‌కు ఘన స్వాగతం

ధవళేశ్వరం, జూన్14: టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రిగా నియమితులైన కందుల లక్ష్మీదుర్గేష్ శుక్రవారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ మీదుగా ధవళేశ్వరం విచ్చేశారు. ఈ సందర్భంగా కడియం, వేమగిరి, ధవళేశ్వరం, రాజమండ్రికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని బ్యారేజ్ కూడలి వద్ద ఘనస్వాగతం పలికారు. ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంఘ నాయకులు, ఇరిగేషన్ ఉద్యోగులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన కాటన్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామంలో పలు చోట్ల అభిమానులు, నాయకులు నీరాజనాలు అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు యడ్ల మహేష్, అల్లంపల్లి ముత్యాలు, యడ్ల వెంకటేష్, దిండి జగదీష్, బీరా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకి అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 14: టీడీపీ అధినేత చంద్రబాబుకు అభివృద్ధి -సంక్షేమం రెండు కళ్లు అని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు.రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కూటమికి రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పట్టారని చెప్పారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఐదు ఫైళ్లపై సంతకాలు చేసి తన నిబద్ధతను రుజువు చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. సమావేశంలో కాశి నవీన్‌కుమార్, రాచపల్లి ప్రసాద్, శెట్టి జగదీష్, జక్కంపూడి అర్జున్, సంసాని ప్రసాద్, ఆడారి లక్ష్మణరావు, మళ్ల వెంకట్రాజు, ఎం.పెద్దకాపు పాల్గొన్నారు.

కొండ అక్రమ తవ్వకాలపై
కౌంటర్ దాఖలుకు నోటీసులు

సీతానగరం, జూన్ 14: మండలంలోని నల్గొండ పంచాయతీ పరిధిలోని కొండపై జరిగిన అక్రమ తవ్వకాలపై వచ్చే నెల 8లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఎన్జీటీ నోటీసులు జారీ చేసిందని చినకొండేపూడికి చెందిన అడ్వకేట్, పర్యావరణ ప్రేమికుడు నకుల సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సర్వే నెంబరు 241/3లోని కొండను అక్రమంగా తవ్వడంపై ఎన్జీటీని ఆశ్రయించగా దీనిపై విచారణ జరిపి, జూలై 8కి వాయిదా వేస్తూ ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన జిల్లా కలెక్టర్, సీతానగరం తహశీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ, రఘుదేవపురానికి చెందిన పెందుర్తి హనుమంతులకు నోటీసులు జారీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

పంచాయతీల్లో అవినీతిపై విచారణ చేపడతాం

అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి/రంగంపేట/బిక్కవోలు, జూన్ 14: వైసీపీ పాలనలో నియోజకవర్గంలో కొందరు అధికా రులు లెక్కలేనంత అవినీతికి పాల్పడ్డారని, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపడతామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, జేఈలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనపర్తి, మామిడాడ, కొమరిపాలెం గ్రామాల పంచాయతీలపై అనేక ఆరోపణలున్నాయని, వీటిపై విచారణ చేపడతామన్నారు. అనపర్తి పంచాయతీలో 14,15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఈ నెలాఖరుకు వివరాలు అందించాలన్నారు. అలాగే సమీక్షలో బిక్కవోలు మండలం బలభద్రపురం పంచాయతీలో ఎంబుక్ కనిపించకపోవడంపై విచారణ చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధికారులు, కార్యదర్శులు, ఎన్డీయే నాయకులు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులను బిక్కవోలులో దేవదాయశాఖ ఆధ్వర్యంలో వేదపండితులు ఘనంగా సత్కరించారు. మంత్రోచ్చారణల నడుమ సన్మానించి ఆశీర్వచనాలు అందజేశారు. ప్రాచీన ఆలయాల ఈవో ఏఎస్‌బీజీ రామలింగం, టీడీపీ నాయకులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి.. లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యస్వామి వార్ల చిత్రపటాన్ని ఎమ్మెల్యే దంపతులకు బహూకరించారు. కార్యక్రమంలో గుణ్ణం రమేష్‌చౌదరి, సన్నిధిరాజు సుబ్రహ్మణ్యశర్మ, కొడమంచిలి సత్యనారాయణశర్మ, బిక్కవోలు రఘురామ్, నామాల ప్రసాద్ పాల్గొన్నారు. కాగా రంగంపేట మండలం వడిశలేరులో వైసీపీ నాయకుల చేతిలో దాడికి గురైన టీడీపీ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు పసల గగారిన్, ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నల్లమిల్లి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు కొమ్ముకాస్తున్న ఎస్ఐపై నిప్పులు చెరిగి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వడిశలేరులో జరిగిన స్కామ్‌లు అన్నీ బయట పెడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, వెలుగుబంటి సత్తిబాబు, నీలపాల త్రిమూర్తులు, ఉద్దండ్రావు శ్రీను, పోతుల వెంకట్రావు, మాచిన వెంకన్నదొర పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులను సత్కరిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

భూ హక్కు చట్టం రద్దుపై హర్షం

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 14: భూ హక్కు చట్టాన్ని రద్దు చేయడం సాహసోపేతమైన నిర్ణయమని రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ అన్నారు. ఏపీ భూహక్కు చట్టాన్ని రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్న సందర్భంగా శుక్రవారం అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పెల్లూరి రమేష్ అధ్యక్షతన బార్ నాయకులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

‘పుష్కర’తో సాగు నీరందించడమే లక్ష్యం

ఇరిగేషన్ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే బత్తుల



ఇరిగిషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజమహేంద్రవరం సిటీ/కోరుకొండ, జూన్ 14: పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గ రైతులకు సాగు నీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రైతుకు, ప్రతీ ఎకరానికి సాగు నీరందించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. రాజమహేంద్రవరంలో జనసేన కార్యాలయంలో శుక్రవారం రాజానగరం నియోజకవర్గానికి సంబంధించి పుష్కర, సూరంపాలెం, ముసురుమిల్లి, చాగల్నాడు, తొర్రిగడ్డ, ఎత్తి పోతల పథకాల్లో సమస్యలపై ఆయన సమీక్ష నిర్వహించారు. పాతవెంకటనగరం పంపింగ్ స్కీమ్, మైనర్ ఇరిగేషన్, చెరువులు, గోదావరి ఏటి గట్లపై ఆరా తీశారు. ఎత్తిపోతల పథకాల్లో ఇతరత్రా సమస్యలుంటే పది రోజుల్లో తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఎడమ ప్రధాన కాలువ డివిజన్ ఎస్ఈ ఏసుబాబు పుష్కర ఎత్తిపోతల పథకంతో పాటు ము సురుమిల్లి, సూరంపాలెం, పుషోత్తపట్నం పంపింగ్ స్కీమ్‌ల సమస్యలనీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పోలవరం ఎడమ కాలువపై గాదరాడ వద్ద రూ31.10 కోట్ల వ్యయంతో కొత్త ఎత్తిపోతల పథకం నిర్మించడానికి హైడ్రోలోజికల్ క్లియరెన్స్ అనుమతులు తీసుకోవాలని అధికారులు తెలిపారు. వాటన్నింటిపైన సమగ్ర నివేదికను తయారు చేసి తనకు అందించా లని అధికారులను ఆయన కోరారు. గాదరాడ ఎత్తిపోతల పథకం ద్వారా గాదరాడ చుట్టపక్కల సుమారు 2961 ఎకరాలకు సాగు నీరందుతుందన్నారు. సమావేశంలో సూరంపాలెం ఈఈ శ్రీనివాస్, ధవళేశ్వరం-1 ఈఈ పీవీవీఎస్ఎస్ రాజారావు, ధవళేశ్వరం-2 ఈఈ ఎన్‌పీ రాజేశ్వరావు, ఈఈ కాశీ విశ్వేశ్వరరావు, డీఈఈ యు.రమేష్, ఏఈలు శివప్రసాద్, ప్రసన్నకుమార్, ఏపీఎస్, ఐడీసీ ఈఈ కె.విజయభాస్కరెడ్డి, డీఈ దుర్గ గురవయ్య, ఏఈ సురేంద్ర పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుపై హర్షం

రంగంపేట, జూన్ 14: ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రాష్ట్రంలోని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం రంగంపేటలో ఎన్టీరామారావు విగ్రహం వద్ద ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై ఏర్పాటు చేసిన రైతుల సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆళ్ల గోవింద్, వెలుగుబంటి సత్తిబాబు, నీలపాల త్రిమూర్తులు, ఉద్దండ్రావు శ్రీను, పోతుల వెంకట్రావు, పూసల శ్రీను పాల్గొన్నారు.

కడియం: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు సంతకం చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, న్యాయవాదులు, గ్రామీణ ప్రాంత ప్రజలు సంతోషంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ సంతకం చేసిన సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ యాక్ట్‌ను రద్దు చేసి సీఎం చంద్రబాబు హామీని నిలబెట్టుకున్నారన్నారు.

పిడుగుపాటుకు మూడు చూడి ఆవులు మృతి

రాజానగరం, జూన్ 14: రాజానగరం శివారు సూర్యారావుపేటలో పిడుగుపాటుకు గురై మూడు చూలి ఆవులు మృత్యువాత పడ్డాయి. శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో బాటు పిడుగులు కుడా పడడంతో వడయార్ ఆసుపత్రి ప్రాంగణంలోని వేపచెట్టుకు సమీపంలో భారీశబ్ధంతో పిడుగు పడింది. దీంతో చెట్టు కింద కట్టిన వల్లభశెట్టి సత్యనారాయణకు చెందిన రెండు చూలి ఆవులు, ముప్పిడి పెద్దులుకు చెందిన మరో చూలి ఆవు మరణించాయి. వాటి విలువ సుమారు రూ.1 లక్ష ఉంటాయని బాధిత రైతులు తెలిపారు. అలాగే మండలంలోని శ్రీకృష్ణపట్నంలో వీచిన ఈదురుగాలులకు నిమ్మకాయల సెంటరు వద్ద భారీ వృక్షం విద్యుత్ వైర్లపై పడడంతో స్తంభం నేలకొరిగింది. ఆ సమయంలో విద్యుత్‌సరఫరా లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

వివాహితపై కట్నం వేధింపులు

సీతానగరం, జూన్ 14: మండలంలోని కూనవరానికి చెందిన నేళ్ల సువర్ణ జ్యోతి ఫిర్యాదు మేరకు వరకట్నం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. జ్యోతికి అదే గ్రామానికి చెందిన మేనత్త కుమారుడు నేళ్ల బాలాజీతో 2014లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. భర్త, అత్త అలివేలు మంగ అదనపు కట్నం కోసం తనను మానసికంగాను శారీరకంగా హింసిస్తున్నట్టు జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బంగారం చోరీపై కేసు

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు సీఐ ఉమర్ తెలిపారు. కొప్పర్తి శ్రీనివాసరెడ్డి ప్రైవేటు ఉద్యోగం చేస్తూ స్పిన్నింగ్ మిల్ కాలనీలో నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి ఇంటికి వచ్చి నిద్రించారు. ఇంట్లో ఉన్న బంగారు వస్తువులు, సెల్‌ఫోన్ చోరీకి గురికావడం శుక్రవారం ఉదయం గమనించారు. 20గ్రాముల రెండు బంగారపు గొలుసులు, ఒక ఉంగరం, సెల్‌ఫోన్ దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి వెనుక తలుపు ఆదమరుపుగా వదిలేయడంతో అటు నుంచి దొంగ ఇంట్లోకి ప్రవేశించాడని అనుమానిస్తున్నారు.

కార్యకర్తలను విస్మరించాం : వైసీపీ నాయకులు

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను విస్మరించడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని వైసీపీ నాయకులు మనోవ్యధను వ్యక్తంచేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వైసీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఐప్యాక్ సిబ్బంది జీతమిస్తే తప్ప పనిచేయరని విమర్శించారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను విస్మరించడంపై క్షమాపణలు కోరుతున్నానన్నారు. కొత్త ప్రభుత్వం చేసే అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ పేపర్ వర్క్ అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. తమ పార్టీ ఘోరమైన ఓటమికి కారణాలను విశ్లేషించుకొనే పనిలో ఉన్నామన్నారు. కూటమి ఏర్పాటు చేసి విజయపథంలో తీసుకెళ్లిన నాయకుడు పవన్‌కల్యాణ్ అని సీనియర్ నాయకుడు నక్కా శ్రీనగేశ్ అన్నారు.

మాజీ ఎమ్మెల్యే మాటలు హాస్యాస్పదం: పెందుర్తి

కోరుకొండ, జూన్ 14: గత 2014-2019 మధ్య జరిగిన అభివృద్ధి కంటే ఎక్కువ చేశానని మాజీ ఎమ్మెల్యే పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని, ఆ సమయంలో తాను టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నానని ప్రజలకు అనేక మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. శుక్రవారం ఆయన కోరుకొండ టీడీపీ కార్యాలయానికి వచ్చారు. ముందుగా కాపవరం జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రగా కోరుకొండ బస్టాండ్‌కు చేరుకుని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి ర్యాలీగా టీడీపీ కార్యాలయానికి చేరుకుని విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరి పరిపాలనలో ఎక్కువరోడ్లు, డ్రైన్‌లు ప్రజా సంక్షేమం జరిగిందో, నియోజకవర్గంలోని 5 మేజర్ గ్రామాల్లో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. వైసీపీ పాలనలో మద్యం దుకాణాల వద్ద దోపిడీలను, ఇసుక, మట్టి, కొండలు అక్రమ దోపిడీలను అనేక సార్లు ఆధారాలతో నిరూపించామన్నారు. వైసీపీ నాయకులు ఎందుకు ఓడిపోయారో వారి అరాచకాలు ఏ విధంగా ఉన్నాయో పక్క రాష్ట్రాల వారు చర్చించుకుంటున్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకుడు మింగి లక్ష్మీనారాయణ, రొంగల శ్రీనివాసు, నూనె వెంకన్న, కొయ్యాశామ్యూల్, పడగళ్లపాటి శ్రీనివాస్, రాయిపాటి సత్తిబాబు, కట్టా సత్తిబాబు, కాండ్రేగుల కృష్ణ, కోర్పు రాజేష్, మారిశెట్టి రమణ, తెలగంశెట్టి శ్రీనివాసు పాల్గొన్నారు.

వారంలో ఖాళీస్థలాలు శుభ్రం చేసుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 14: రాజమహేంద్రవరంలో ఖాళీగా ఉన్న స్థలాలను వాటి యజమానులు వారం రోజుల్లో శుభ్రం చేసుకోవాలని కమిషనర్ దినేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వలేకుండా మట్టితో లెవెలింగ్ చేయించుకోవాలన్నారు. లేకపోతే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ప్రత్యేక హోదా సాధించాలి

గోకవరం, జూన్14: ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో నూతనంగా కొలువు దీరిన ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు కోరారు. రంపయర్రంపాలెంలో శుక్రవారం రైతు కూలీ సంఘం మండల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నాయకుడు కుంచె అంజిబాబు కర్నాకుల రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్, గోలి ముసలయ్య, నక్కా వీరపండు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

కడియం, జూన్ 14: వీరవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. పిల్లల చదువు-భవితకు వెలుగు, పనికెందుకు తొందర-చదవుకో ముందర అనే స్లోగన్స్ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 15 జూన్ 2024 | 5







సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

అవినీతి అధికారులపై విచారణ : గోరంట్ల

రాజమహేంద్రవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వీఆర్‌వోల నుంచి తహశీల్దార్..కలెక్టరేట్ వరకూ రెవెన్యూ అధికారులు చేసిన అవినీతి, అన్యాయాలపై విచారణ జరిపిస్తామని.. వైసీపీ నేతలతో కుమ్మక్కయి తప్పులు చేసిన అధికారుల భరతం పడతామని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి స్పష్టం చేశారు. తన స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ మొదలు అవినీతికి పాల్పడిన వారందరినీ చట్టప్రకారం శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో రెవెన్యూ అధికారులు అనేక మంది ఎకరాల కొలదీ భూములను అన్యాక్రాంతం చేశారన్నారు. అవన్నీ బయటకు రప్పించి చట్టప్రకారం దోషులపై చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్ ఎమ్మెల్యేనైన నాకు కూడా ప్రొటోకాల్ పాటించకుండా ఇబ్బందులు పెట్టారని వాపోయారు. రాజమహేంద్రవరం రూరల్ పరిసర గ్రామాల విలీన ప్రక్రియను పూర్తి చేసి మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిపిస్తామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఐదు హామీల అమలు ఫైళ్లపై సంతకం చేశారన్నారు. డిసెంబర్ లోపు మెగా డీఎస్సీ పూర్తి చేయడానికి ఆదేశాలిచ్చారన్నారు. మంచి సేవల ద్వారా ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. బాధితులకు అండగా నిలబడతానన్నారు.

గోదావరి ప్రక్షాళనకు ప్రాజెక్టు..

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూన్ 14 : రాజమహేంద్రవరంలో రామకృష్ణనగర్, నేతాజీ నగర్, రైల్వేస్టేషన్,ఆవ చానల్‌లు కొత్త ముంపు ప్రాంతాలుగా మారాయని వాటికి ప్రత్యామ్నాయంగా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సూచించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు , ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఆయన శుక్రవారం ఆవచానల్, ధవళేశ్వరం సాయిబాబా ఆలయం వద్ద గల మురుగుకాలువను పరిశీలించారు. గత రెండేళ్లుగా ఎత్తిపోతల పథకాన్ని అధికారులు పెండింగ్‌లో పెట్టారని దీంతో వర్షం పడినప్పుడల్లా కొత్త ముంపు ప్రాంతాలు తయారవుతున్నాయన్నారు.ఈ ప్రాజెక్ట్ త్వరితగిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.గతంలో గంగా కాలుష్య నివారణ పథకంలో గోదావరి ప్రక్షాళన కార్యక్రమానికి నాంది పలకడం జరిగిందని.. అది సుమారు వెయ్యి నుంచి రూ.1200 కోట్లు ప్రాజెక్ట్ అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రాజెక్ట్ పూర్తి చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. అది పెండింగ్‌లో ఉందని ఈ సారి దానిని పూర్తి చేసే ఆలోచనలో ఉన్నామన్నారు.అయన వెంట గోరంట్ల కుమార్తె కంఠమనేని శిరీష, రూరల్ టీడీపీ అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, టీడీపీ నాయకులు, అధికారులు ఉన్నారు.

వరిలో విత్తన శుద్ధి తప్పనిసరి : జేడీఏ

రాజానగరం, జూన్ 14 : వరి నారుమడుల తయారీలో రైతులు విధిగా విత్తన శుద్ధి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులకు సూచించారు. కలవచర్లలోని వరి నారుమడులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. వరి నారుమడిలో యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తన శుద్ధి గురించి రైతులకు వివరించారు. కిలో విత్తనానికి కార్బండిజమ్ లేదా మాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి వాడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీఏ ఏడీ జయ లక్ష్మి,ఆత్మ పీడీ జ్యోతిర్మయి, డీఆర్‌ఆర్సీ ఏడీఎం జయలక్ష్మి,ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డి, ఏవో షేక్ ఖాసిం పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట : ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిడద వోలు పోలీస్ స్టేషన్‌ని ఎస్పీ జగదీశ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తులో పురోగతి, నేర నియంత్రణపై ఆరా తీశారు.

పొట్టకూటికి వెళ్లి.. పరలోకానికి..

రోడ్డు ప్రమాదంలో కాకినాడ, కోనసీమ జిల్లావాసులు ఐదుగురు మృతి

- మెయిన్‌లో..

తూర్పున.. త్రి..నేత్రం!



ముగ్గురికి చంద్రబాబు మార్క్ మంత్రి పదవులు

చంద్రబాబా... మజాకానా.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ముగ్గురు మంత్రులకు శాఖలు కేటాయించారు.. శెహబాస్ అనిపించుకున్నారు.. జిల్లాను దృష్టిలో పెట్టుకుని అత్యంత కీలక శాఖలు కట్టబెట్టారు... జిల్లాలో గ్రామీణ ప్రాంతం చాలా ఎక్కువ... ఈ నేపథ్యంలో పల్లెల దశ..దిశ మారుస్తానంటూ రాజకీయాల్లోకి వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖలను కేటాయించారు. మరో మంత్రి కందుల దుర్గేష్‌కు పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలను కేటాయించారు.. ఇటు గోదావరి నుంచి అటు ఏజెన్సీ వరకు... మరో పక్కఎంతో అందమైన కడియపులంకను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి జిల్లాలో ఎంతో అవకాశం ఉంది. ఇక మూడో మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కార్మిక శాఖ కేటాయించారు. మన జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు.. పరిశ్రమల కార్మికులు ఎక్కువే.. ఇలా మూడు శాఖలు 'తూర్పు'నకు త్రినేత్రమే....

- కీలక శాఖలు అప్పగింత
- పల్లెల బాధ్యత పవన్‌కు..
- జిల్లాలో గ్రామాల విస్తీర్ణమే ఎక్కువ
- సురక్షిత తాగునీటికి ఆయనే దిక్కు
- పర్యాటకానికి కేరాఫ్‌గా దుర్గేష్
- జిల్లాలో గోదావరి.. సముద్రం
- కార్మిక సమస్యలు తీర్చేలా సుభాష్
- జిల్లావ్యాప్తంగా బోలెడు పరిశ్రమలు
- లక్షలాదిగా భవన నిర్మాణ కార్మికులు
- 'తూర్పు' దశ మారేలా కేటాయింపులు

పవన్.. పంచాయతీరాజ్

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు అత్యంత కీలక శాఖలు లభించాయి. మంత్రులకు శుక్రవారం శాఖల కేటాయింపు జరగ్గా అందులో భాగంగా సీఎం చంద్రబాబు పవన్‌కు అత్యంత ముఖ్యమైన బాధ్యతలు కట్టబెట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్), అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను కేటాయించారు. అటు డిప్యూటీ సీఎం పదవి కూడా కేటాయిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకరకంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సురక్షిత తాగునీరు, ఇంటింటికీ కుళాయి తదితర పనులన్నీ ఈ శాఖల ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి. దీంతో జిల్లాలో అత్యధికంగా ఉన్న గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక మంది మంత్రులుగా పనిచేశారు. అయితే పీఆర్, రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యుఎస్, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు ఇంతకు ముందు ఎవరికీ దక్కలేదు. ఏ ప్రభుత్వంలో అయినా ఈ కీలక శాఖలను అత్యంత సీనియర్ మంత్రులకే కేటాయించేవారు. కానీ ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం హోదాలో ఈ ముఖ్యమైన శాఖలను కట్టబెట్టడం విశేషం. వాస్తవానికి ఈ శాఖలు పూర్తిగా గ్రామీణ మండలాలకు సంబంధించినవి. అటు పవన్‌కు కూడా ఈ శాఖల ద్వారా గ్రామాల రూపురేఖలను మార్చాలనే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో అవే దక్కడం విశేషం. పవన్ కల్యాణ్ ఒకట్రెండు రోజుల్లో తనకు కేటాయించిన శాఖల బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రధానంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి జిల్లాలో అనేక పనులు చేపట్టడానికి వీలుంది. ఈ శాఖ పరిధిలోకి పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు రానున్నాయి. గ్రామాల్లో అభివృద్ధి, వాటి రూపురేఖలను మార్చడం ఈ శాఖ ద్వారానే సాధ్యం. ఈ శాఖకు అటు రాష్ట్రం, ఇటు కేంద్రం నుంచి సైతం నిధులు భారీగా వస్తాయి. తద్వారా జిల్లాలో పంచాయతీలపై దృష్టిపెట్టి వాటిని పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడానికి పవన్‌కు అవకాశం కలిగిందనే చెప్పాలి. ప్రధానంగా పిఠాపురం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతం ఎక్కువ. తనకు దక్కిన శాఖల ద్వారా నియోజకవర్గంలో పంచాయతీలను ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు అభివృద్ధి బాట పట్టించడానికి పవన్‌కు మార్గం సుగగమైందనే చెప్పాలి. గ్రామీణ నీటిసరఫరా శాఖ(ఆర్‌డబ్ల్యుఎస్) శాఖ మంత్రిగా పవన్‌కు గ్రామాల్లో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడానికి గట్టిగా పనిచేసే అవకాశం లభించిందనే చెప్పాలి. ఇంటింటికీ తాగునీటి కుళాయి పథకం ఈశాఖ పరిధిలోకే వస్తుంది. ఇప్పటికే కేంద్రం జాతీయ జలమిషన్ కింద జిల్లాకు రూ.500కోట్లకుపైగానే కేటాయించింది. కానీ గత వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వలేదు సరికదా, ఇంటింటికీ కుళాయి పనులను గాలికొదిలేసింది. ఇంటింటికీ సురక్షిత తాగునీరు పథకాన్ని ఎన్నికలకు ముందు టీడీపీ తన సూపర్ సిక్స్‌లో ప్రకటించింది. జిల్లాకు ఈ శాఖ ద్వారా భారీగా నిధులు పవన్ కేటాయించి పనులు చేయించే అవకాశం ఏర్పడింది. వాస్తవానికి కలుషిత నీరు తాగి తొండంగి మండలంలో రెండు రోజులుగా 300 మంది వరకు డయేరియా బారిన పడ్డారు. ఇందులో ఒకరు శుక్రవారం మృతి చెందారు. కలుషిత నీటి మరణాలు లేకుండా గ్రామీణనీటి సరఫరాశాఖ ద్వారా జిల్లాతో పాటు పిఠాపురం నియోజకవర్గానికి సైతం భారీగా నిధులు కేటాయించవచ్చు. అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు పవన్‌కే దక్కాయి. ఆయా శాఖల్లో గత ప్రభుత్వ అరాచకాలపై విచారణ చేయడంతో పాటు ఇకపై వీటి ఉల్లంఘనలు జరగకుండా పవన్ దృష్టిసారించాల్సి ఉంది.

దుర్గేష్‌కు.. పర్యాటకం

రాజమహేంద్రవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.. ఇది జిల్లా వాసులు పదేపదే వినేమాట.. ఆ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకున్నారో ఏమో కానీ జిల్లా నుంచి నిడదవోలు ఎమ్మెల్యేగా ఎన్నికైన కందుల దుర్గేష్‌కు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖలను కేటాయిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిడదవోలు నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారిగా కందుల దుర్గేష్‌కు మంత్రి పదవి దక్కింది. ఇప్పటివరకూ జిల్లాకు పర్యాటక శాఖ కేటాయించిన దాఖలాలు లేవు. తొలిసారి ఆ పర్యాటక శాఖ దక్కడంపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యాటకానికి ఎంతో అవకాశం ఉంది. ఒకపక్క ఉభయగోదావరి జిల్లాల్లో ఎంతో అందమైన గోదావరి.. మరోపక్క చూసే కొద్దీ చూడాలనిపించే సముద్రం.. ఇంకోపక్క మడ అడవులు.. ఏజెన్సీ.. అక్కడ జాలువారే జలపాతాలు.. ఇక షూటింగ్‌లు చేసుకోవడానికి ఎంతో అందమైన ప్రకృతి.. సాంస్కృతికపరంగా రాజమహేంద్రవరానికి పెద్ద పేరు.. ఇవన్నీ ఆలోచించే దుర్గేష్‌కు ఆ శాఖలు కేటాయించి ఉంటారని జనం భావిస్తున్నారు.. గత పుష్కరాల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అఖండ గోదావరిలో బోటు మీద స్వయంగా పర్యటించి అఖండ గోదావరి టూరిజం ప్రాజెక్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పట్లో రూ.100 కోట్లు కేటాయించారు. రాజమహేంద్రవరం కేంద్రంలో ఈ ప్రాజెక్టు కార్యాలయం ఏర్పాటు చేశారు. పిచ్చుకలంకను అభివృద్ధి చేయాలని, హేవలాక్ బ్రిడ్జిని తీర్చిదిద్దాలని, రాజమండ్రిలోని చారిత్రక కట్టడాలను, ప్రాంతాలను పర్యాటక హబ్‌గా మార్చాలని ప్రయత్నం చేశారు. పాపికొండలును అభివృద్ధి చేయాలనుకున్నారు. కాకినాడ హోప్ ఐలాండ్, కోరంగి మడ అడవులు, కోనసీమ ప్రాంతాలను అభివృద్ధి చేసి టూరిజానికి తగినట్టు హోటళ్లు, రిసార్ట్ అభివృద్ధి చేసే ప్రయత్నం చేశారు. కానీ జగన్ నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అఖండ గోదావరి ప్రాజెక్టు మూతపడింది. అసలు పర్యాటక రంగాన్ని పట్టించుకోలేదు. గోదావరి జిల్లాలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధి ఆగిపోయింది. టూరిజం పట్ల అభి రుచి ఉన్న చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడం, ఈ ప్రాంత అభివృద్ధిని కోరుకునే కందుల దుర్గేష్‌కి పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల దక్కడంతో ఈ ప్రాంతం టూరిజం హబ్‌గా అభివృద్ధి చెందనుంది. మంత్రి పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా రాజమహేంద్రవరం వచ్చిన మంత్రి కందుల దుర్గేష్‌కు సిటీ జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. సుమారు 4 గంటలకు ధవళేశ్వరం వచ్చిన మంత్రి దుర్గేష్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరడానికి మూడున్నర గంటలు సమయం పట్టింది. అదే సమయంలో వర్షం రావడంతో తడుస్తూనే ర్యాలీ కొనసాగించారు.

కార్మిక శాఖకు..సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 14: కార్మికులు కష్టాలు తీరనున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎటు చూసినా పరిశ్రమలు అధికం.. మరో వైపు భవన నిర్మాణ కార్మికులు ఎక్కువే. ఈ నేపథ్యంలో రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వాసంశెట్టి సుభాష్‌కు కార్మిక శాఖ కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో గతం నుంచీ ఎంతో మంది మంత్రులుగా పనిచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా ఏర్పడిన తరువాత సుభాష్ తొలిసారి మంత్రి పదవి చేపట్టారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎంతో మంది మంత్రులుగా పనిచేశారు. ఇప్పటివరకు ఎవరూ కార్మిక శాఖను చేపట్టిన దాఖలాలు లేవు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులతో పాటు అనేక ఇతర రంగాలకు చెందిన కార్మికులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలు జరిగే అనేక సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయాయి. కార్మిక సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించారని విమర్శలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ బోర్డు ద్వారా అమలు జరిగే అన్ని పథకాలు నిలిచిపోయాయి. దీంతో కార్మికులు తీవ్ర ఆవేదన చెందారు. ప్రస్తుత ప్రభుత్వంలో జిల్లాకు కార్మికశాఖ దక్కడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్మిక శాఖ కేటాయించిన వెంటనే మంత్రి సుభాష్ విజయవాడలో కార్మిక శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. కార్మికులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పథకాలపై చర్చించారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన అన్ని సంక్షేమ పథకాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని మంత్రి సుభాష్ ప్రకటించడంతో కార్మికులు, కార్మిక సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొవ్వూరులో.. గలీజు!



మునిసిపల్ షాపుల అద్దె వ్యవహారంలో కక్కుర్తి

- మునిసిపల్ ఆదాయానికి భారీగా గండి
- రూ.775 నుంచి షాపు అద్దె ఆరంభం
- బహిరంగ మార్కెట్‌లో రూ.10 వేలపైనే
- వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు
- 20 ఏళ్లుగా షాపుల్లో దళారీల తిష్ట
- అయినా పట్టని ఉన్నతాధికారులు
- మళ్లీ టెండర్లు పిలవాలని డిమాండ్

కొవ్వూరు, జూన్ 14: అధికారుల చేతివాటంతో మునిసిపల్ ఆదాయానికి గండి పడుతుంది. పట్టణంలో కమర్షియల్ షాపుల లీజులు రూ.10 వేల నుంచి రూ.22 వేలు నడుస్తుండగా మునిసిపల్ కమర్షియల్ షాపులు మాత్రం ఎక్కడా లేని విధం గా రూ.3500లకే అతి తక్కువ లీజుకు మునిసిపల్ రెవిన్యూ సిబ్బంది ప్రతిపాదనలు చేసి పాలకవర్గాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. కొవ్వూరు మునిసి పాలిటీకి మెయిన్ రోడ్‌లో బాపూజీ కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్, మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద, సత్యవతినగర్, అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద 110 కమర్షియల్ షాపులు ఉన్నాయి. ఆ షాపుల అద్దెలు చూస్తే అందరూ అవాక్కవుతారు. ఎందుకంటే ఒక్కో షాపు అద్దె అతి తక్కువ రూ.775.. ఎక్కువ రూ.5333ల లీజు. దీంతో 110 షాపుల నుంచి మునిసిపాలిటీకి సుమారు రూ.కోటి ఆదాయం రావాల్సి ఉండగా కేవలం రూ.29.44 లక్షల ఆదాయం మాత్రమే వస్తుంది. అంటే ఒక్కో షాపు లెక్కించినా కేవలం రూ.2900 అద్దె మాత్రమే వస్తుందన్నమాట..

ఒక్కోషాపు అద్దె రూ.775

కొవ్వూరు మెయిన్‌రోడ్‌లో మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో కమర్షియల్ షాపులను లీజుకివ్వడానికి సుమారు 20 ఏళ్ల కిందట అధికారులు టెం డర్లు పిలిచారు. నిబంధనల ప్రకారం టెండర్లు దక్కించుకున్న వ్యక్తులే షాపులు నడిపించుకోవాలి ఇతరులకు ఇవ్వరాదు. కాని చాలా మంది టెండర్ల తర్వాత మూడు రెట్లు పెంచి మరలా వేరేవారికి అద్దెకిచ్చారు. ఇదంతా మునిసిపల్ అధికారులకు తెలిసే జరుగుతున్నాకిమ్మనరు. కొవ్వూరు మునిసిపాలిటీలో చిన్న జాగా ఉంటే రూ.5 వేలకు అద్దెకు ఇస్తున్నారు. మెయిన్‌రోడ్‌లో షాపు అద్దెలు రూ.10 వేల నుంచి రూ.22 వేల వరకు ఉన్నాయి. అటువంటిది కొవ్వూరులోని ప్రధాన మార్కెట్ సెంటర్ బాపూజీ కూరగాయల మార్కెట్‌లో మునిసిపల్ షాపులను అధికారులు కేవలం రూ.775ల నుంచి రూ.2350లకు లీజుకు అందజేశారు. బాపూజీ కూరగాయల మార్కెట్‌లో 18 షాపులు ఉండగా 1వ నెంబరు షాపు రూ.11485, 2,3,4,5,6,7,8 షాపులు లీజు ఒక్కో షాపునకు రూ.5333, 9 నుంచి 15 షాపులు ఒక్కో షాపు రూ.2890 లీజుకు అందజేశారు. ఒకే ప్రాంగణంలో ఉన్న 15 షాపుల్లో అద్దెలను చూస్తే మునిసిపల్ అధికారుల కక్కుర్తి బయటపడుతుంది. జూనియర్ కాలేజ్ సెంటర్‌లో ఉన్న పంచాయితీరాజ్ షాపుల అద్దె కంటే తక్కువ అద్దెకు లీజుకు ప్రతిపాదించడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. కొవ్వూరులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఆర్అండ్ బీ కార్యాలయం ముందు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రేకులషెడ్డులో ఉన్న షాపులు నెలకు లీజు రూ.1197లు, వాటర్‌ట్యాంకు జీఎన్‌టీ రోడ్‌లో ఉన్న షాపులు రూ.775ల నుంచి 2350 వసూలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో అద్దెలు భారీగా పెరుగుతున్నా మునిసిపల్ అధికారులు అక్రమార్కులకు మద్దతిస్తూ మునిసిపల్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

నిబంధనలు హుష్‌కాకి

షాపుల లీజు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్‌ఆర్‌వో రేట్లు, ప్రస్తుత అద్దెపై 33 శాతం పెంపు, బహిరంగ మార్కెట్‌లో అద్దెలను పరిశీలించి, వాటిలో ఏది ఎక్కువ ఉంటే వాటి ప్రాతిపదికన లీజు పెంపుదల చేయాలి. కాని కొవ్వూరు మునిసిపాలిటీలో ఏది తక్కువ ఉందో దానిని తీసుకుని లీజు పెంపుదల చేస్తూ మునిసిపల్ ఆదాయానికి అధికారులు గండి కొడుతున్నారు. మునిసిపల్ అధికారులు పట్టణంలో చుట్టుపక్కల అద్దెలను అతి తక్కువ చూపించి పాలకవర్గాన్ని పక్కదారి పట్టించి లీజుదారులకు మేలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో షాపుల అద్దె పట్టణంలో ఎటు చూసినా రూ.10 వేల నుంచి రూ.22 వేలు ఉండగా మునిసిపల్ అధికారులు మెయిన్‌రోడ్‌లో బాపూజీ కూరగాయల మార్కెట్ చుట్టు పక్కల కేవలం రూ.5,333లీజు ఉందని పాలకవర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 15వ తేదీన జరగనున్న కౌన్సిల్ అజెండాకు షాపుల లీజు పొడిగింపును తీసుకొచ్చారు.ఉన్నతాధికారులుపట్టించుకోకపోవడంతో ఇలా ఇష్టారాజ్యం చేస్తున్నారు.ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు, పాలకవర్గం మునిసిపల్ కమర్షియల్ షాపుల అద్దెల లీజులపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.మునిసిపల్ షాపులను లీజుకు ఇచ్చి 10 నుంచి 20 ఏళ్ల పూర్తయిన కారణంగా పట్టణంలో ఉన్న మునిసిపల్ షాపులన్నింటికి కొత్తగా టెండర్లు పిలిచి మునిసిపల్ ఆదాయం పెంపునకు కృషి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



మంత్రి దుర్గేష్‌కు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఘన స్వాగతం పలుకుతున్న అభిమానులు





నిడదవోలులో సొంతిల్లు తీసుకుంటా : దుర్గేష్

తాను ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో చెప్పినట్టు త్వరలో నిడదవోలులో సొంతిల్లు తీసుకుంటా.. అక్కడే ఎక్కువగా ఉండి ఆ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరంలో కూడా ఉంటానని తెలిపారు.జనసేన అధినేత పవన్ వల్లే మంత్రి అయ్యానన్నారు. పర్యాటక హబ్‌గా గోదావరి ప్రాంతాన్ని తీర్చిదిద్దుతానని, వచ్చే పుష్కరాల నాటికి ఒక రూపు తీసుకొస్తామన్నారు. నన్ను ఆదరించిన నిడదవోలు,జిల్లా ప్రజలకు రుణ పడి ఉంటానన్నారు. కేవలం 45 రోజులే నిడదవోలు ప్రచారం చేశానని.. అందరూ సహకరించి గెలిపించారన్నారు.తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా అన్నంపెట్టే పథకమైన నిడదవోలు పెండ్యాల పంపింగ్ స్కీన్‌ను ప్రారంభించానన్నారు.పిఠాపురం టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి పవన్‌కల్యాణ్‌కు రోడ్‌మ్యాప్ ఉందని, త్వరలో కార్యాచరణ చేపడతామన్నారు. లోకేష్ రెడ్ బుక్‌లోని అందరి మీద చట్టప్రకారమే చర్యలు ఉంటాయన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 14 : మంత్రి హోదాలో తొలిసారి రాజమహేంద్రవరం విచ్చేసిన కందుల దుర్గేష్‌కు ఘన స్వాగతం లభించింది. అడుగడుగునా జనం హారతులు పట్టారు. ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత, ఎస్పీ జగదీశ్ , జేసీ ఎస్.తేజ్‌భరత్,ఆర్డీవో ఏ.చైత్ర వర్షిణి మంత్రిర దుర్గేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అంద జేసి అభినంద నలు తెలిపారు. పర్యాటక పరంగా జిల్లాలో అవకాశం ఉన్న పలు అంశాలపై కలెక్టర్‌తో మంత్రి చర్చించారు.

పురందేశ్వరికి మంత్రి పదవి రావాలని జైనుల పూజలు

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రజాభిమానంతో ముందుకు సాగిపోవాలని, రాజమహేంద్రవరం ఎంపీ విజేత దగ్గుబాటి పురందేశ్వరికి కేంద్ర మంత్రి పదవి రావాలని ఆకాంక్షిస్తూ జైనులు ప్రత్యేక పూజలు చేశారు.రాజమహేంద్రవరంలోని శ్రీ సుమతీనాథ్ జైన్ శ్వేతాంబర్, శ్రీ సుమతీనాథ్ వాసబూజ్య జైన్ మందిరాల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం జైన సంప్రదాయాలను అనుసరించి పూజలు చేశారు. నూతనంగా పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కందుల దుర్గేశ్, రాజమండ్రి సిటీ, రూరల్ ఎమ్మెల్యే విజేతలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దినేశ్ కుమార్ జైన్, హేమరజ్జి జైన్, భేరూలాల్ జైన్, రాజేంద్ర షరాఫ్, గున్వంత్ జైన్, సంజయ్ విజావత్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న జైనులు

కూటమి ప్రభుత్వం ప్రజా విజయం
ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


ఎమ్మెల్యే ముప్పిడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న తాళ్లపూడి అంగన్‌వాడీలు

కొవ్వూరు, జూన్ 14: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ ఏర్పాటు ప్రజా విజయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యేతోపాటు ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావులకు వేములూరు గ్రామస్థులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో అఖండ విజయం సాధించడంపై పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. అలాగే విద్యుత్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు కలిశారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్న, సూర్యదేవర రంజిత్, రైతు మండలాధ్యక్షుడు అక్కిన రాంబాబు, మరపట్ల కళాధర్, ఇమ్మణి ప్రసాద్, పెరవలి రంగాప్రసాద్, బంబోతు సురేష్, జె.బలరామకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అంగన్‌వాడీలు

తాళ్లపూడి, జూన్ 14: మండల అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, నూతన ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మెగా డీఎస్సీపై ఉపాధ్యాయ సంఘం హర్షం

కొవ్వూరు, జూన్ 14: నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం మొదటి సంతకం మెగా డీఎస్సీపై పెట్టడం హర్షనీయమని డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ రీ ఆర్గనైజ్ టీచర్స్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జె.పాండు, డి.ప్రకాశరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అఖండ విజయం సాధించి, ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే సీఎం చంద్రబాబు డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌పై మొదటి సంతకం చేయడం నిరుద్యోగుల పట్ల ఉన్న ప్రేమను, నిజమైన విద్యా సాధనకు నిదర్శనమన్నారు. చంద్రబాబు చారిత్రాత్మక నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

కొవ్వూరు, జూన్ 14: మహిళల ఆర్థిక స్వావలంబనకు నాబార్డు, ఏఏఎల్‌పీ స్వచ్ఛంద సేవా సంస్థలు పాటుపడుతున్నాయని నాబార్డు డీడీఎం డాక్టర్ వైఎస్ నాయుడు అన్నారు. కొవ్వూరు మండలం వేములూరు గ్రామంలో నాబార్డు సహకారంతో ఏఏఎల్‌పీ సంస్థ అధ్యక్షుడు ఏఎల్ ప్రాంక్లిన్‌ప్రై ఆధ్వర్యంలో శుక్రవారం 30 మంది మహిళ సంఘ సభ్యులకు ఎంబ్రాయిడరీ శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. నాయుడు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు సూక్ష్మతరహా పరిశ్రమల స్థాపనకు ఈ శిక్షణ దోహద పడుతుందన్నారు. జిల్లా ఎల్‌డీఎం డీవీ ప్రసాద్, పీఎంఎఫ్ఎంఈ, జిల్లా కన్వీనర్ ఎం.రాజ్‌కిషోర్, యూబీఆర్ఎస్‌టీఐ డైరెక్టర్ టి.శ్రీనివాస్, సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, మరపట్ల కళాధర చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

కొవ్వూరు, జూన్ 14: కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా న్యాయవాదులు కోర్టులకు సహకరించాలన్నారు. ప్రతిరోజు ప్రీ సిట్టింగ్‌లు నిర్వహించి కేసులు రాజీ మార్గంలో పరిష్కరిస్తున్నామన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

హోం మంత్రిని కలిసిన 'యువగళం'



తాళ్లపూడి, జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వ హోంశాఖా మంత్రిగా నియమితులైన వంగలపూడి అనితను టీడీపీ నాయకులు, యువగళం టీం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 2019లో కొవ్వూరు ఎమ్మెల్యేగా పోటీచేసిన సమయంలో నియోజకవర్గ నాయకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేశారని కా కర్ల సత్యేంద్ర తెలిపారు. కార్యక్రమంలో కూచిపూడి గణేష్, నాదెళ్ల శ్రీరాం, మద్ది పట్ల సురేష్, బొల్లిన నాగేంద్ర, బొడ్డు కేశవ, పత్తిపాటి శశాంక్ పాల్గొన్నారు.

పాఠశాలలకు 37,537 పుస్తకాలు అందజేత

దేవరపల్లి, జూన్ 14: దేవరపల్లి మండలంలో 2024-25 విద్యా సంవత్సరానికి 85 ప్రభుత్వ పాఠశాలలకు 45,075 పుస్తకాలు రావల్సి ఉండగా అందులో 37,537అందుబాటులో ఉన్నాయని, పాఠశాలలకు అందించినట్టు ఎంఈవోలు తిరుమలదాసు, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. మండలంలోని 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు 22,270పుస్తకాలు, 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 15,267 పుస్తకాలు అందించామన్నారు. విద్యార్థుల కిట్లలో భాగంగా బెల్టులు 3479, స్కూల్‌బ్యాగులు 5233, పంపిణీ చేశామన్నారు. విద్యార్థులకు రావల్సిన యూనిఫామ్‌లు, రెండు, మూడు రోజుల్లో అందుతాయని చెప్పారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న సువర్ణరాజు, రామతులసి

గోపాలపురం, జూన్ 14: దొండపూడిలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సువర్ణరాజు, టీడీపీ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి పాల్గొన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించేందుకు దేవతలంతా ఏకమయ్యారని, అందుకే ప్రజల పాలన తెచ్చే నాయకులను అధికారంలోకి తేవడానికి ఈ రాష్ట్ర ప్రజల మనస్సులు మార్చారని సువర్ణరాజు అన్నారు. కార్యక్రమంలో మద్దాల సనారి, ముత్యాల ముత్యాలరాయుడు, హంస్సేన్, ప్రగడ రాంబాబు, వెంకన్న, నాని పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న జనసైనికులు



ఉండ్రాజవరం/నిడదవోలు, జూన్ 14: ఎన్నికల్లో నిడదవోలు నియోజవర్గం నుంచి కందుల దుర్గేష్ విజయం సాధించాలని మండలంలోని అట్లపాడుకు చెంన జనసైనికులు చినవాడపల్లి వెంకటేశ్వరస్వామికి మొక్కుకున్నారు. ఈ మేరకు శుక్రవారం స్వామివారికి 116 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. రాష్ట్రం బాగుండాలని, దుర్గేష్ నాయకత్వం వర్ధిల్లాలని కోరుకున్నట్టు చెప్పారు.

స్కూల్ ప్రహరి పడగొట్టి కచ్చారోడ్డు నిర్మాణం



చాగల్లు, జూన్ 14: మండలంలోని దారవరం ఎంపీపీ స్కూల్ (మెయిన్) ప్రహరిగోడ పడగొట్టి కచ్చారోడ్డు వేసిన సంఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు ఎంఈవో సీహెచ్ సుబాకర్ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు స్కూల్ ప్రహరిని కూల్చివేసి ఆ గ్రావెల్‌తో కచ్చారోడ్డు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు కొవ్వూరు కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, జూన్ 14: కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్టు ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. పట్టణంలోని 23 వార్డుల్లో చేపట్టిన, చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై చర్చించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

'ల్యాండ్ టైటిల్లింగ్'రద్దుపై న్యాయవాదుల హర్షం


విజయవిహార్ సెంటర్‌లో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ద్విసభ్య కమిటీ

» కొవ్వూరులో విజయోత్సవ ర్యాలీ

కొవ్వూరు, జూన్ 14: ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై న్యాయవాదులు విజయోత్సవం నిర్వహించారు. శుక్రవారం కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ప్రాంగణం నుంచి విజయవిహార్ సెంటర్ వరకు విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. దీనికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ ప్రజలను భయాందోళనకు గురిచేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు రెండో సంతకం చేశారన్నారు. 2019లో ప్రజలు 151 సీట్లు ఇస్తే అధికార మదంతో జగన్మోహనరెడ్డి తుగ్లక్ పాలన అందించారని, అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఇసుక, మైనింగ్, లిక్కరు, మైనింగ్ దోచుకున్నారు. చివరకు ప్రజల భూములపై కన్నేసి, వాటిని లాక్కోవాలనే కుట్రతో లాండ్ టైటిలింగ్ యాక్టును తీసుకొచ్చారని, పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మలు వేసుకున్నాడన్నారు. దీంతో భయాందోళన చెందిన ప్రజలు, న్యాయవాదులు రోడ్లెక్కి పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్న, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, పరిమి రాధ, ఆళ్ల హరిబాబు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షురాలు బొబ్బా భారతి, అర్దిల్లి రామకృష్ణ, బర్ల శ్రీనివాస్, మద్దుల సత్యనారాయణ, ముప్పరాజు శ్రీనివాస్, టిఎస్వీ రమణమూర్తి, తక్కెళ్ళ చిట్టిబాబు, మైగాపుల పరమేష్, అక్కిన రాంబాబు, మరపట్ల కళాధర్, కనిగంటి సాంబయ్య పాల్గొన్నారు.

జనసేన నాయకులతో కలిసి పాలన అందిస్తా

» ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు.. పలువురి అభినందనలు

నల్లజర్ల, జూన్ 14: నియోజక వర్గంలో జనసేనతో కలిసి పాలన అందిస్తానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శుక్రవారం నల్లజర్ల పార్టీ కార్యాలయంలో జనసేన నియోజక వర్గ కన్వీనర్ సువర్ణరాజు, మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, అచ్యుత సత్యనారాయణ తదితరులు మద్దిపాటికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ ప్రతి అంశం సువర్ణరాజుతో చర్చించి ముందుకెళ్తానన్నారు.

చీపురుగూడెంలో విజయోత్సవ ర్యాలీ

మండలంలోని చీపురుగూడెంలో శుక్రవారం సాయంత్రం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ అధ్యక్షుడు చెల్లు పెద్దరామన్న, ఎంపీటీసీ రావూరి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూసంపూడి వెంకటేశ్వరరావు, చెల్లు వీరవెంకట్రావు, మోదుగ సుబ్బారావు, వరుణ్, పలపరాజు, హరిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మద్దిపాటిని కలిసిన రెవెన్యూ అధికారులు

దేవరపల్లి, జూన్ 14: ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును నల్లజర్లలో టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం తహశీల్దార్ వైవీఎస్ ఆచారి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ మణికంఠ, కంప్యూటర్ ఆపరేటర్ ఐ.రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్లు మద్దిపాటిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


మద్దిపాటికి అభినందనలు తెలుపుతున్న సువర్ణరాజు తదితరులు

క్లీన్ సిటీగా తీర్చిదిద్దండి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

» రాజమహేంద్రవరంలో పారిశుధ్యంపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 14 : రాజమహేంద్రవరాన్ని ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో అన్ని డివిజన్లలో క్షేత్రస్థాయిలో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై శుక్రవారం సమీక్షించారు. పారిశుధ్యపరంగా ప్రజలు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కారణంగా నగరంలో ముంపుప్రాంతాలకు విముక్తి కలిగించడం కోసం చేపట్టాల్సిన పనులపై పలు సూచనలు చేశా రు. చౌడేశ్వరనగర్, కోరుకొండ రోడ్డు, జెఎన్ రోడ్డు, కంబాలచెరువు తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థలో ఉన్న లోపాలపై చర్చించారు. కొన్ని మార్పులు చేయడం ద్వారా వచ్చే ఫలితాలను వివరించారు. నగరంలో పందులు, కుక్కల సమస్యకు పరిష్కారంపై సలహాలు ఇచ్చారు. నగరంలో దోమలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పలు డివిజన్లకు చెందిన ఇన్‌చార్జిలు రెడ్డి మణేశ్వరావు, కంటిపూడి శ్రీనివాసరావు, మరుకుర్తి రవియాదవ్, శెట్టి జగదీష్, యిన్నమూరి రాంబాబు, బుడ్డిగ రవి, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, అగురు ధనరాజు సమస్యలను వివరించారు. అన్నింటిపైన కమిషనర్ దినేష్ కుమార్ స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. క్లీన్ అండ్ హెల్త్ సిటీగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు స్వచ్ఛత ర్యాంకింగ్‌లో మన నగరాన్ని దేశంలో 91 నుంచి 54కు తీసుకువచ్చామని ఈ సారి టాప్ 20వ స్థానానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ సత్యవేణి, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, ఉర్లంకల లోకేష్, శానిటరీ సూపర్ వైజర్ ఐ.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెకర్లు పాల్గొన్నారు.

'పుష్కర'తో సాగు నీరందించడమే లక్ష్యం

» ఇరిగేషన్ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే బత్తుల

రాజమహేంద్రవరం సిటీ/కోరుకొండ, జూన్ 14: పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గ రైతులకు సాగు నీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రైతుకు, ప్రతీ ఎకరానికి సాగు నీరందించాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. రాజమహేంద్రవరంలో జనసేన కార్యాలయంలో శుక్రవారం రాజానగరం నియోజకవర్గానికి సంబంధించి పుష్కర, సూరంపాలెం, ముసురుమిల్లి, చాగల్నాడు, తొర్రిగడ్డ, ఎత్తి పోతల పథకాల్లో సమస్యలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పథకాల మరమ్మతుల విషయంలో అలసత్వం వద్దన్నారు. పాతవెంకటనగరం పంపింగ్ స్కీమ్, మైనర్ ఇరిగేషన్, చెరువులు, గోదావరి ఏటి గట్లపై ఆరా తీశారు. ఎత్తిపోతల పథకాల్లో ఇతరత్రా సమస్య లుంటే పది రోజుల్లో తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఎడమ ప్రధాన కాలువ డివిజన్ ఎస్ఈ ఏసుబాబు పుష్కర ఎత్తిపోతల పథకంతో పాటు ము సురుమిల్లి, సూరంపాలెం, పుషోత్తపట్నం పంపింగ్ స్కీమ్‌ల సమస్యలనీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పోలవరం ఎడమ కాలువపై గాదరాడ వద్ద రూ31.10 కోట్ల వ్యయంతో కొత్త ఎత్తిపోతల పథకం నిర్మించడానికి హైడ్రోలోజికల్ క్లియరెన్స్ అనుమతులు తీసుకోవాలని అధికారులు తెలిపారు. వాటన్నింటిపైన సమగ్ర నివేదికను తయారు చేసి తనకు అందించా లని అధికారులను ఆయన కోరారు. గాదరాడ ఎత్తిపోతల పథకం ద్వారా గాదరాడ చుట్టపక్కల సుమారు 2961 ఎకరాలకు సాగు నీరందుతుందన్నారు. సమావేశంలో సూరంపాలెం ఈఈ శ్రీనివాస్, ధవళేశ్వరం-1 ఈఈ పీవీవీఎస్ఎస్ రాజారావు, ధవళేశ్వరం-2 ఈఈ ఎన్‌పీ రాజేశ్వరావు, ఈఈ కాశీ విశ్వేశ్వరరావు, డీఈఈ యు.రమేష్, ఏఈలు శివప్రసాద్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


ఇరిగిషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

బ్లడ్ డోనర్‌కు సత్కారం

ఉండ్రాజవరం/నిడదవోలు, జూన్ 14: ప్రపంచ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా నిడదవోలు సామాజిక కేంద్ర వైద్య సిబ్బంది సంజీవిని హెల్పింగ్ హ్యాండ్స్, బ్లడ్ డోనర్స్ స్వచ్ఛంద సంస్థ అధినేత సరిపల్లి రమణను ఘనంగా సత్కరించారు. ఆయన ఇప్పటివరకు 96సార్లు రక్తదానం చేయడం పట్ల పలువురు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.కళ్యాణచక్రవర్తి, నాయకులు రంగా రమేష్, పి.వెంకటరత్నం, జి.శ్రీనివాస్, పి.అయ్యప్ప, సీహెచ్ రాజా తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: తెలికిచర్లలో రక్తదానంపై ప్రజలకు చిరంజీవి సేవ సమితి అధ్యక్షుడు రుద్ర శ్రీను అవగాహన కల్పించారు. ఏటా అనేక మందికి రక్తదానం చిరంజీవి సేవ సమితి ద్వారా ఇస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా నల్లజర్ల జనసేన ఐటీ వింగ్ సభ్యుడు పాతాళ్ల గణేశ్ 8వ సారి రక్తదానం చేశారు.

మలేరియాపై అవగాహన ఉండాలి

ఉండ్రాజవరం, జూన్ 14: మండలంలోని వెలగదుర్రు గ్రామంలో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, మలేరియా వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కలిగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వైద్యసిబ్బంది సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జి.శ్రీనివాసరావు, వి.చిరంజీవి, ఎ.విజయకుమార్, కుమారి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మినీ స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించాలి


మినీ స్టేడియం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం/నిడదవోలు, జూన్ 14: నిడదవోలులో 2018లో విద్యానగర్‌లో రూ.2కోట్లతో ప్రారంభమైన మినిస్టేడియం నిర్మాణ పనులు వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపుగా నిలిపివేసిందని, ఆ పనులను ప్రారంభించాలని నిడదవోలు పట్టణ అభివృద్ధి జేఏసీ కన్వీనర్, మినీ స్టేడియం సాధన కమిటీ కన్వీనర్ జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మినిస్టేడియం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. స్టేడియం నిర్మాణానికి 2018లో కృషి చేసిన మాజీ ఎమ్మె ల్యే బూరుగుపల్లి శేషారావును అభినందించారు. మంత్రి దుర్గేష్ నియోజవర్గ అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వారియర్స్ జిమ్ కోచ్ బొచ్చా కృష్ణ, ఎస్.శ్రీధర్, భాస్కర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళల అక్రమ రవాణా అరికట్టాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు, ప్రజ్వల ప్రతినిధులు

చాగల్లు, జూన్ 14: సమాజంలో జరుగుతున్న లైంగిక వ్యాపారం, మహిళల అక్రమ రవాణాపై యువత చైతన్యం కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ అన్నారు. మహిళల అక్రమ రవాణా నిరోధంపై రెండు రోజులు పాటు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సమస్య వస్తే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ కె.బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ మహిళల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా 28 ఏళ్లుగా సేవలందిస్తోందని, నష్టపోయిన వారికి పునరావాసం కూడా కల్పిస్తున్నామన్నారు. కోఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను కమ్యూనిటీ విజిలంట్ గ్రూపులను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామన్నారు. మహిళల అక్రమ రవాణా, శ్రమ, లైంగిక, అవయవాల దోపిడిలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివ, సుప్రియ, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

జీవవైవిధ్యం మానవాళికి మూలాధారం

రాష్ట్ర అటవీ అకాడమి డైరెక్టర్ కృష్ణప్రియ



దివాన్‌చెరువు, జూన్ 14: జీవవైవిధ్యం మానవాళికి మూలాధారమని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ అన్నారు. గుంటూరులోని రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సౌజన్యంతో జీవ వైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణా కార్యక్రమం లాలాచెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాల్లో తెలియజేసి, తద్వారా వారిని జీవవైవిధ్య పరిరక్షణలో భాగస్వాములను చేయాలని కోరారు. జీవవైవిధ్యంపై అవగాహన, దానిని పరిరక్షించుకోవలసిన అవసరం, జీవవైవిధ్యం చట్టాలను వివరించడం ముఖ్యోద్దేశంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. రెండురోజులు పాటు జరిగే ఈ కార్యక్రమానికి తొలి రోజు రంపచోడవరం, విశాఖపట్టణం, విజయనగరం, చీరాల తదితర ప్రాంతాల నుంచి యాజమాన్య కమిటీ సభ్యులు హాజరయ్యారు. అలాగే అకాడమీ అధికార్లు వి.శ్రీహరిగోపాల్, ఎస్వీ శివరాంప్రసాద్, ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి ప్రాంతీయ కోఆర్డినేటర్లు జానకిరామ్, చెన్నకేశవ, సత్యప్రసాద్ తదితర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులకు సత్కారం

బిక్కవోలు, జూన్ 14: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులను శుక్రవారం బిక్కవోలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో వేదపండితులు ఘనంగా సత్కరించారు. మంత్రోచ్ఛారణల నడుమ సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. బిక్కవోలు ప్రాచీన ఆలయాల ఈవో ఏఎస్‌బీజీ రామలింగం, టీడీపీ నాయకులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి.. లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యస్వామి వార్ల చిత్రపటాన్ని ఎమ్మెల్యే దంపతులకు బహూకరించారు. కార్యక్రమంలో గుణ్ణం రమేష్‌చౌదరి, సన్నిధిరాజు సుబ్రహ్మణ్యశర్మ, కొడమంచిలి సత్యనారాయణశర్మ, బిక్కవోలు రఘురామ్, నామాల ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు కృషి చేయాలి
ఏపీ రైతు కూలీ సంఘం నాయకులు

గోకవరం, జూన్14: ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో నూతనంగా కొలువు దీరిన ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు కోరారు. మండలంలోని రంపయర్రంపాలెంలో శుక్రవారం జరిగిన రైతు కూలీ సంఘం మండల స్థాయి సమావేశంలో రాజబాబుతో పాటు ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు మాట్లాడుతూ కొన్నేళ్లగా రాష్ట్రం అధోగతి పాలైందని, ప్రత్యేక హోదా తెస్తామని 2014లో టీడీపీ, 2019లో వైసీపీ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక ఆ మాటే మర్చిపోయారని గుర్తుచేశారు. ఇప్పుడైనా రాష్ట్రంలో అధికారం చేపట్టి అటు కేంద్రంలో కీలకపాత్ర పోసిస్తున్న చంద్రబాబు ప్రత్యేక హోదా కోసం పాటుపడాలన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ కాకుండా చూడాలన్నారు. రాష్ట్రానికి రాజధాని నిర్మాణం, విశాఖ రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజన చట్టంలోని హామీలను అమలు చేసే విధంగా కృషి చేయాలని నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్, గోలి ముసలయ్య, నక్కా వీరపండు, గుడిసే చెల్లారావు, అన్నిబోయిన కృష్ణ, కాసర చిన్నఅప్పారావు, రడవల రమణ, తదితరులు పాల్గొన్నారు.

వీరవరంలో విద్యార్థుల ర్యాలీ

కడియం, జూన్ 14: మండలంలోని వీరవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీలో పాల్గొన్నారు. పిల్లల చదువు-భవితకు వెలుగు, పనికెందుకు తొందర-చదవుకో ముందర అనే స్లోగన్స్ ఇస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

కడియం, జూన్ 14: లాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు సంతకం చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, న్యాయవాదులు, గ్రామీణ ప్రాంత ప్రజలు సంతోషంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ సంతకం చేసిన సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ యాక్ట్‌ను రద్దు చేసి సీఎం చంద్రబాబు హామీని నిలబెట్టుకున్నారన్నారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి

సీతానగరం, జూన్ 14: పర్యావరణంపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ గౌరీశంకర్ సూచించారు. సీతానగరం జడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. ఎంఈవో స్వామినాయక్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 19 వరకు పాఠశాలల్లో పలు అంశాలపై కార్యక్రమాలు ఉంటాయన్నారు. చెత్తను తగ్గించడంపై కార్యక్రమం నిర్వహించామన్నారు. చెత్తను డబ్బాలో సేకరించి కిచెన్ గార్డెన్‌కు కంపోస్ట్‌గా వినియోగించుకోవాలన్నారు. 15న ఎలక్ట్రానిక్ చెత్తను తగ్గిండం, 18న స్థిరమైన ఆహార వ్యవస్థలను అనుసరించడం, 19న ఆరోగ్య శైలిపై కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.సతీష్‌బాబు, పీడీ సింహాద్రి శంకర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండ అక్రమ తవ్వకాలపై
కౌంటర్ దాఖలుకు నోటీసులు

సీతానగరం, జూన్ 14: మండలంలోని నల్గొండ పంచాయతీ పరిధిలోని కొండపై జరిగిన అక్రమ తవ్వకాలపై వచ్చే నెల 8లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఎన్జీటీ నోటీసులు జారీ చేసిందని చినకొండేపూడికి చెందిన అడ్వకేట్, పర్యావరణ ప్రేమికుడు నకుల సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సర్వే నెంబరు 241/3లోని కొండను అక్రమంగా తవ్వడంపై ఎన్జీటీని ఆశ్రయించగా దీనిపై విచారణ జరిపి, జూలై 8కి వాయిదా వేస్తూ ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన జిల్లా కలెక్టర్, సీతానగరం తహశీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ, రఘుదేవపురానికి చెందిన పెందుర్తి హనుమంతులకు నోటీసులు జారీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

వెనుక తలుపులు మరచిపోతే.. దోచేశారు..

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉమర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పర్తి శ్రీనివాసరెడ్డి ప్రైవేటు ఉద్యోగం చేస్తూ స్పిన్నింగ్ మిల్ కాలనీలో నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి ఇంటికి వచ్చి నిద్రించారు. ఇంట్లో ఉన్న బంగారు వస్తువులు, సెల్‌ఫోన్ చోరీకి గురికావడం శుక్రవారం ఉదయం గమనించారు. 20గ్రాముల రెండు బంగారపు గొలుసులు, ఒక ఉంగరంతోపాటు ఒక సెల్‌ఫోన్ దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి వెనుక తలుపు ఆదమరుపుగా వదిలేయడంతో అటు నుంచి దొంగ ఇంట్లోకి ప్రవేశించాడని అనుమానిస్తున్నారు.

కార్యకర్తలను విస్మరించాం
వైసీపీ నాయకుల మనోవ్యథ

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను విస్మరించడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని వైసీపీ నాయకులు మనోవ్యధను వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వైసీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఐప్యాక్ సిబ్బంది జీతం ఇస్తే తప్ప పనిచేయరని విమర్శించారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను విస్మరించడంపై క్షమాపణలు కోరుతున్నానన్నారు. కొత్త ప్రభుత్వం చేసే అభివృద్ధికి తాము పూర్తిగా సహకరిస్తామన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ పేపర్ వర్క్ అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని పేర్కొన్నారు. తమ పార్టీ ఘోరమైన ఓటమికి కారణాలను విశ్లేషించుకొనే పనిలో ఉన్నామన్నారు. కార్యకర్తలను దూరం పెట్టడమే ఓటమికి ఓ కారణంగా భావిస్తున్నామన్నారు. కూటమి ఏర్పాటు చేసి విజయపథంలో తీసుకెళ్లిన నాయకుడు పవన్‌కల్యాణ్ అని వైసీపీ సీనియర్ నాయకుడు నక్కా శ్రీనగేశ్ ప్రశంసించారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	లవ్ మీ
వై.స్క్రీన్2	గంగం గణేశా
దేవిశ్రీ(గాయత్రి)	భజే వాయువేగం
అనన్య	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
నిడదవోలు	
వీ మ్యాక్స్	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
రాధాకృష్ణ	భజే వాయువేగం
శ్రీగణపతి	మనమే
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---